Follow: @ANNTELUGU

15-07-2026

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 192 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత
- సీఎం చంద్రబాబు, జగన్, రేవంత్, కేసీఆర్ సహా ప్రముఖుల సంతాపం

**హైదరాబాద్, కాకినాడ, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన

టాప్ న్యూస్

## రా ఎన్టీఆర్' సంస్థతో ఎలాంటి సంబంధం లేదు

- జూనియర్ ఎన్టీఆర్ ఆఫీస్ క్లారిటీ
- రూమర్స్ కు బ్రేక్



02

## మీనాక్షి నటరాజన్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

- కడియం వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం
- సంయమనం పాటించాలని ఇన్‌ఛార్జ్ సూచన



02

## కరువు, కాళేశ్వరంపై ప్రభుత్వం స్పందించాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్



02




2028 జూన్ 2 నాటికి

# వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయండి

- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయండి
- విమానయాన శాఖా మంత్రిని కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన
- వేగంగా భూసేకరణ పూర్తి చేయడంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి

**ఢిల్లీ, మహా :** అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని మిగతా 2వ పేజీలో

# పక్క రాష్ట్ర మంత్రి పక్కా స్కెచ్..!



- కలెక్టరేట్ ప్రజావాణికి చేరిన ఫిర్యాదులు
- ఫిర్యాదులు వెల్లువెత్తినా ఆగని అక్రమ నిర్మాణాలు
- గడప దాటని టౌన్ ప్లానింగ్ సిబ్బంది
- నోటీసులతోనే సరిపెడుతున్న ఏసీపీ?
- 'సర్' పేరుతో కాలయాపన చేస్తున్న అధికారులు
- చర్యలు తీసుకుంటామంటున్న డిప్యూటీ కమిషనర్!

02

## సర్వే నంబర్లు 11/33, 11/34లో ప్రభుత్వ భూమి గల్లంతు..!

### రూ. 100 కోట్ల విలువైన 4 వేల గజాల సర్కారు భూమి హాంఫట్..!



శేరిలింగంపల్లి మండలం ఖానామేట్‌లోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని పక్క రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి దురాక్రమణకు తెగబడినట్లు స్థానికంగా బహిరంగ చర్చ జరుగుతుంది. ప్రభుత్వ నిషిద్ధ ఆస్తుల 22 (ఎ) జాబితాలో నమోదైన సర్వే నంబర్లు 11/33, 11/34ల లోని సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, భారీ నిర్మాణాలు చేపట్టడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణిలో ఫిర్యాదులు, వార్తా పత్రికల్లో వరుసగా కథనాలు వెలువడుతున్నప్పటికీ అధికార యంత్రాంగం నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సుమారు రూ. 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఓ మంత్రి కబంధ హస్తాల్లో చిక్కి అన్యాక్రాంతమవుతోందన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో ఆ మంత్రి ఒక్కరేనా? లేక స్థానిక రాజకీయ నాయకుల భాగస్వామ్యం, అధికార వర్గాల అండదండలు కూడా ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఐటీ హబ్‌గా పేరొందిన హైటెక్ సిటీ నడిబొడ్డున కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై సాగుతున్న ఈ భూదందా పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి స్పందించి బహిరంగ విచారణ చేస్తే వాస్తవాలు బట్టబయలు అవుతాయని వారు పేర్కొంటున్నారు.

# రికార్డు స్థాయికి ఎండలు



- ప్రపంచ దేశాల్లో ఉష్ణోగ్రతల కొత్త చరిత్ర
- ఎల్‌నినో, గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తీవ్రం
- అనేక దేశాల్లో చరిత్రాత్మక ఎండలు నమోదు
- ప్రజారోగ్యం, వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది
- కార్బన్ ఉద్గారాల తగ్గింపే శాశ్వత పరిష్కారం

02

## హరిత విప్లవమా... అమెరికా విష వలయమా? 04

ఆనాటి ప్రభుత్వ ఆహార భద్రతా నిర్లక్ష్యం, వైఫల్యం

## సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత

సమస్యల నివారణపై ముందస్తు దృష్టి అవసరం



- డేటా ఆధారిత పాలనకు సీఎం ప్రాధాన్యం
- నెలవారీ ఆర్థిక నివేదికలతో పనితీరు సమీక్ష
- ప్రజల అర్జీలపై జీరో పెండెన్సీ లక్ష్యం
- పోలవరం 2027 మార్చికల్లా పూర్తి లక్ష్యం
- మంత్రులు, అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

02

## మూడు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన

- అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ.
- అమరరాజా యూనిట్ ప్రారంభం.

02






మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | బుధవారం, హైదరాబాద్ | 15-07-2026
ANN తెలుగు



# వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయండి

( మొదటి పేజీ తరువాయి )

ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

**వరంగల్ ఫస్ట్**

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

# రికార్డు స్థాయికి ఎండలు

**ఢిల్లీ, మహా** : ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రరూపం దాల్చుతోంది. ఎల్‌నినో ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ కారణంగా అనేక దేశాలు తమ చరిత్రలో ఎన్నడూ లేని అత్యధిక ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాయి. ఐరోపా, ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, మధ్యప్రాచ్య దేశాల్లో వరుసగా కొత్త ఉష్ణోగ్రత రికార్డులు నమోదవుతుండటంతో ప్రపంచ వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఒక్కటే పలు దేశాలు తమ చరిత్రలో ఎన్నడూ నమోదు కాని అత్యధిక ఉష్ణోగ్రతలను నమోదు చేయడం గమనార్హం.యూరప్‌లో వేడి తీవ్రత మరింత పెరిగింది. డెన్మార్క్‌లో 37 డిగ్రీల సెల్సియస్, జెర్సీలో 39.3 డిగ్రీలు, బెలారస్‌లో 40.4 డిగ్రీలు, పోలాండ్‌లో 40.5 డిగ్రీలు, స్లోవేకియాలో 41.3 డిగ్రీలు, జర్మనీలో 41.8 డిగ్రీలు, చెక్ రిపబ్లిక్‌లో 41.9 డిగ్రీలు, హంగేరీలో 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదై కొత్త రికార్డులు సృష్టించాయి. ఇప్పటికే ఫ్రాన్స్‌లో 46 డిగ్రీలు, స్పెయిన్‌లో 47.6 డిగ్రీలు, గ్రీస్‌లో 48 డిగ్రీలు, ఇటలీలో 48.8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆసియా దేశాల్లో కూడా వేడి తీవ్రత మరింత పెరుగుతోంది. భారత్‌లో అత్యధికంగా 51 డిగ్రీల సెల్సియస్, చైనాలో 52.2 డిగ్రీలు, పాకిస్థాన్‌లో 53.7 డిగ్రీలు, ఇరాన్‌లో 54 డిగ్రీలు నమోదవగా, బంగ్లాదేశ్‌లో 45.1 డిగ్రీలు, జపాన్‌లో 41.8 డిగ్రీలు, దక్షిణ కొరియాలో 41 డిగ్రీలు నమోదయ్యాయి. మధ్యప్రాచ్య దేశాల్లో బహ్రెయిన్‌లో 47.6 డిగ్రీలు, సౌదీ అరేబియాలో 52 డిగ్రీలు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 52.1 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఆఫ్రికా ఖండంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మొరాకోలో 50.4 డిగ్రీలు, అల్జీరియాలో 51.3 డిగ్రీలు, ట్యునీషియాలో 55 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అమెరికాలోని కాలిఫోర్నియాలోని డెత్ వ్యాలీలో 56.7 డిగ్రీల సెల్సియస్ నమోదై ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రతగా కొనసాగుతోంది. కెనడాలో 49.6 డిగ్రీలు, మెక్సికోలో 52 డిగ్రీలు, బ్రెజిల్‌లో 44.8 డిగ్రీలు, అర్జెంటీనాలో 48.9 డిగ్రీలు నమోదయ్యాయి.

అత్యంత చల్లని ఖండంగా పేరొందిన అంటార్కిటికాలో కూడా 19.8 డిగ్రీల సెల్సియస్ నమోదవడం వాతావరణ మార్పుల తీవ్రతకు నిదర్శనంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఐస్‌లాండ్‌లో 30.5 డిగ్రీలు, ఐర్లాండ్‌లో 33.3 డిగ్రీలు, నార్వేలో 35.6 డిగ్రీలు, స్వీడన్‌లో 38 డిగ్రీలు నమోదవడం కూడా అరుదైన పరిణామంగా భావిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వ్యవసాయం, తాగునీటి వనరులు, విద్యుత్ వినియోగం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి గాలుల కారణంగా అడవి మంటలు, కరువు పరిస్థితులు, నీటి కొరత, పంటల దిగుబడులు తగ్గడం వంటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.వాతావరణ మార్పులను నియంత్రించేందుకు కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడం, పచ్చదనాన్ని విస్తరించడం, నీటి వనరుల పరిరక్షణపై ప్రపంచ దేశాలు సమిష్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న ఈ ఉష్ణోగ్రతల రికార్డులు భవిష్యత్తులో వాతావరణ సంక్షోభం ఎంత తీవ్రమవుతుందో హెచ్చరికగా నిలుస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.

# మీనాక్షి నటరాజన్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య కొనసాగుతున్న విభేదాలు పార్టీ అధిష్ఠానం దృష్టికి చేరాయి. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ మంగళవారం కలిసి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.భేటీ సందర్భంగా ఇద్దరి మధ్య నెలకొన్న విభేదాలకు సంబంధించిన అన్ని అంశాలను మంత్రి కొండా సురేఖ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, పరస్పర ఆరోపణలు, పార్టీకి కలుగుతున్న ఇబ్బందులను కూడా ఆమె వివరించినట్లు తెలుస్తోంది.మంత్రి సురేఖ వివరాలను పూర్తిగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించినట్లు సమాచారం. చిన్నచిన్న విషయాలను పెద్ద సమస్యలుగా మార్చకుండా పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని ఆమె హితవు పలికినట్లు తెలిసింది. అంతర్గత విభేదాలు బహిరంగ చర్చకు దారితీయకుండా నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఇదిలా ఉండగా, కడియం శ్రీహరితో నెలకొన్న వివాదంపై మంత్రి కొండా సురేఖ ఇప్పటికే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లను కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజా పరిణామాలతో ఈ వివాదం కాంగ్రెస్ అధిష్ఠానం స్థాయికి చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అయితే ఈ వ్యవహారంపై కడియం శ్రీహరి నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. పార్టీ పెద్దలు ఇద్దరు నేతల మధ్య ఉన్న విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు

( మొదటి పేజీ తరువాయి )



ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి.

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

**చంద్రబాబు సంతాపం**

మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఆయన మృతి వార్త తనను తీవ్ర విచారానికి గురిచేసిందని తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. "మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూశారన్న వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముద్రగడ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తన సంతాప సందేశంలో తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా ముద్రగడ మరణంపై విచారం వ్యక్తం చేశారు.

**ముద్రగడ పద్మనాభం మృతిపై జగన్ సంతాపం**

సీనియర్ రాజకీయ నాయకుడు, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముద్రగడ తనకు పితృ సమానులని, ఆయన మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆయన కోలుకుంటున్నారని భావిస్తున్న తరుణంలో, ఈ విషాదం చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

# మూడు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన

- అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ.
- అమరరాజా యూనిట్ ప్రారంభం.

**హైదరాబాద్, మహా. :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, విద్యా మౌలిక వసతుల బలోపేతానికి సంబంధించిన కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేయడం, అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించడం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

ముఖ్యమంత్రి అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12:15 గంటలకు అక్కడికి చేరుకుని 12:15 నుంచి 12:45 గంటల వరకు అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, సమాచార సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది.

అనంతరం మధ్యాహ్నం 12:50 గంటలకు ఫ్యూచర్ సిటీ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు అక్కడికి చేరుకుని 1:20 నుంచి 2:20 గంటల వరకు అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా తయారీ కేంద్రాన్ని పరిశీలించి, సంస్థ ప్రతినిధులతో సమావేశమవడంతో పాటు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. విద్యుత్ వాహనాల తయారీ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టే దిశగా ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం పేర్కొంటోంది.

ఆ తర్వాత మధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు బయలుదేరనున్న ముఖ్యమంత్రి 2:40 గంటలకు అక్కడికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల వరకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, ప్రభుత్వ విద్యా సదుపాయాలపై అభిప్రాయాలు తెలుసుకోనున్నారు.

పర్యటన ముగిసిన అనంతరం మధ్యాహ్నం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, భద్రతా ఏర్పాట్లను కూడా కట్టుదిట్టం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల అభివృద్ధికి ఈ పర్యటనలో జరిగే కార్యక్రమాలు కీలక మైలురాయిగా నిలుస్తాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# మూడు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన

- అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ.
- అమరరాజా యూనిట్ ప్రారంభం.

**హైదరాబాద్, మహా. :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, విద్యా మౌలిక వసతుల బలోపేతానికి సంబంధించిన కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేయడం, అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించడం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.ముఖ్యమంత్రి అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం..బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12:15 గంటలకు అక్కడికి చేరుకుని 12:15 నుంచి 12:45 గంటల వరకు అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, సమాచార సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది.

అనంతరం మధ్యాహ్నం 12:50 గంటలకు ఫ్యూచర్ సిటీ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు అక్కడికి చేరుకుని 1:20 నుంచి 2:20 గంటల వరకు అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా తయారీ కేంద్రాన్ని పరిశీలించి, సంస్థ ప్రతినిధులతో సమావేశమవడంతో పాటు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. విద్యుత్ వాహనాల తయారీ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టే దిశగా ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం పేర్కొంటోంది.


ఆ తర్వాత మధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు బయలుదేరనున్న ముఖ్యమంత్రి 2:40 గంటలకు అక్కడికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల వరకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, ప్రభుత్వ విద్యా సదుపాయాలపై అభిప్రాయాలు తెలుసుకోనున్నారు.

పర్యటన ముగిసిన అనంతరం మధ్యాహ్నం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, భద్రతా ఏర్పాట్లను కూడా కట్టుదిట్టం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల అభివృద్ధికి ఈ పర్యటనలో జరిగే కార్యక్రమాలు కీలక మైలురాయిగా నిలుస్తాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.



# సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత

**మంత్రులు, అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం**



**అమరావతి, మహా :** "సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు.

డేటా ఆధారిత పాలన.. నెలవారీ నివేదికలతో సమీక్ష

డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్ MER) ద్వారా రాష్ట్ర ప్రగతిని సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. "ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం," అని తెలిపారు.

గత ఐదేళ్ల (201924) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం" అని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా 'స్వర్ణాంధ్ర2047' విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (PGRS)లో 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శ్రీశైలం, పోలవరం వంటి ప్రాజెక్టులు... (continued)

# కరువు,కాళేశ్వరంపై ప్రభుత్వం స్పందించాలి

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్.**

కరువు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో "కరువు వర్సెస్ కాళేశ్వరం.. కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యమేనా?" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈటల రాజేందర్ మాట్లాడుతూ, తాను కరీంనగర్ జిల్లా వాసినని, హుజూరాబాద్ ప్రజల నీటి కష్టాలను 25 ఏళ్లుగా చూస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పడుతున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రాజకీయ విమర్శలకు బదులుగా రైతులను ఆదుకునే చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై రిటైర్డ్ ఇంజనీర్లపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, వారిపై చేసిన వ్యాఖ్యలకు సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం వంటి అంశాలపై బాధ్యులెవరైనా వారిపై చర్యలు తీసుకోవాలని, అయితే ఆధారాలు లేకుండా అందరినీ విమర్శించడం సరికాదన్నారు. తాము ఏ రాజకీయ పార్టీకి మద్దతుగా మాట్లాడడం లేదని, రైతులు, ప్రజలు, న్యాయం, ధర్మం కోసం మాత్రమే మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు. శ్రీరాం సాగర్, లోయర్ మానేరు డ్యాంలు లక్షల ఎకరాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో నిర్మించినప్పటికీ, పూర్తి సామర్థ్యంతో ఉపయోగించలేకపోయామని గుర్తు చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర కరువు వచ్చే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. ఇప్పటికే పత్తి విత్తనాలు మొలకెత్తేందుకు రైతులు బిందెలతో నీళ్లు పోస్తున్న దుస్థితి నెలకొందని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం వెంటనే సాగునీటి సరఫరాపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కన్నెపల్లి వద్ద భారీగా నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతోందని, ఆ నీటిని ఎత్తిపోసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఎల్లంపల్లి నుంచి ఎన్‌టీపీసీ, జెన్‌కో, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులు ఉన్నాయని గుర్తుచేస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచనల మేరకు అవసరమైన అత్యవసర చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాపర్ డ్యామ్ వంటి ప్రత్యామ్నాయ చర్యలపై ఎందుకు ముందడుగు వేయలేదని నిలదీశారు. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేయడం, బెదిరింపు వ్యాఖ్యలు చేయడం తగదని సీఎం రేవంత్ రెడ్డికి సూచించిన ఈటల రాజేందర్, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కరువు పరిస్థితులను యుద్ధప్రాతిపదికన ఎదుర్కొని రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని అన్నారు





## మండలంలో జెడ్పి సీఈఓ నాగలక్ష్మి విస్తృత పర్యటన

**ఎస్ఐఆర్, అభివృద్ధి పనుల అమలు తీరు క్షేత్రస్థాయిలో పరిశీలన**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి, క్లస్టర్ లెవెల్ స్పెషల్ ఆఫీసర్ బి నాగలక్ష్మి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మాచినపేట తండా, అన్నారపాడు, పాపకొల్లు గ్రామాలలో ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు నిర్ణీత గడువులో పూర్తి చేసుకోవాలని ఆయా గ్రామాల ఓటర్లకు సూచించారు. అనంతరం విఓ భవన నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన డ్రైన్లు, సోక్‌పిట్లు పరిశీలించి వాటిని నాణ్యత ప్రమాణాలతో గడువు లోపు పూర్తి చేయాలని సూచించారు. పాపకొల్లులో ఈజీఎస్ ద్వారా నిర్మించిన గ్రావెల్ రోడ్డును పరిశీలించారు. జూలూరుపాడు గ్రామ పంచాయతీలో మొక్కల నాటే కార్యక్రమాన్ని పరిశీలించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ప్రారంభించాల్సిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసి రామ్, ఏపీఓ రామారావు, పిఆర్ఏఈ నవీన్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- డయల్ 100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదు పై తక్షణమే స్పందించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్
- రూ.50 లక్షల విలువ గల 352 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత



**మహా వరంగల్ క్రైం;** పోలీసులు ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో స్థానిక కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల సమావేశ ప్రాంగణంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల ఛేదన, పెండింగ్ కేసుల స్థితి, శాంతిభద్రతల పరిస్థితి, మహిళలు, చిన్నారుల పై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాల పై పోలీస్ కమిషనర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, కేసుల్లో నిందితుల అరెస్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని, చోరీ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును చట్టపరమైన ప్రక్రియ అనంతరం బాధితులకు త్వరగా అందించే చర్యలు చేపట్టాలని, అలాగే మాదక ద్రవ్యాల నియంత్రయ ఇలో భాగంగా పాఠశాలల పరిసరాల్లో గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి పిటిషన్ ను తప్పనిసరిగా నమోదు చేసి, వెంటనే విచారణ అధికారిని నియమించి నిర్ణీత గడువులోగా నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని తెలిపారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదు పై తక్షణమే స్పందించి బాధితులకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ఎఫెక్టివ్ పోలీసింగ్ అమలు చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో లిస్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎసఓపీ)లిను ఖచ్చితంగా పాటిస్తూ చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తుల పై నిరంతర నిఘా ఉంచి, అవసరమైన చోట రౌడీ షీట్లు తెరవాలని, ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**పోగొట్టుకున్న సెల్ ఫోన్లను బాధితులకు అప్పగించిన సీపీ**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ చోరీకి గురైన, పోగొట్టుకున్న సుమారు రూ.50 లక్షల రూపాయల విలువ గల 352 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి స్వాధీనం చేసుకొని మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ చేతుల మీదుగా బాధితులకు సెల్ ఫోన్లను అందజేశారు. ఎవరైనా సెల్ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. బాధితుల సెల్ ఫోన్లను గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ సెల్ బృందాన్ని పోలీస్ కమిషనర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో డిసిపిలు అకింత్ కుమార్, ధార కవిత, రాజ మహేంద్ర నాయక్, కిషోర్ సింగ్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు, ప్రత్యేక విభాగాల అధికారుల తో పాటు కమిషనరేట్ కు చెందిన ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## రైళ్లు పునరుద్దించాలని డీఆర్ఎం కు వినతి

**కారేపల్లి రైల్వే స్టేషన్ ను సందర్శించిన డీఆర్ఎం**

**కారేపల్లి, మహా :** కారేపల్లి రైల్వే స్టేషన్ కరోనా కాలం నుండి నిలుపుదల ఇవ్వాలని, తాత్కాలికంగా రద్దయిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే డివిజన్ మేనేజర్(డీఆర్ఎం) గోపాల్ కృష్ణన్ ను గ్రామస్థులు కోరారు. రాబోయే గోదావరి పుష్కరాల పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం భద్రాచలం రోడ్ వెళ్లిన డీఆర్ఎం తిరుగు ప్రయాణంలో కారేపల్లి రైల్వే స్టేషన్ లో కొద్దిసేపు ఆగారు. డోర్నకల్ భద్రాచలం రోడ్డు రైల్వే మార్గంలో నూతనంగా నిర్మించనున్న డంబ్లింగ్(రెండవ లైన్)రైల్వే పనులను డీఆర్ఎం పరిశీలించారు. కారేపల్లి రైల్వే స్టేషన్ కు చేరుకున్న డీఆర్ఎం ను స్థానికులు కలిసి రైల్వే సమస్యల పై వినతిపత్రం అందజేసినారు. దీనికి డీఆర్ఎం సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ముక్కా సీతారాములు భీమవరపు శ్రీనివాసరావు, పగడాల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. డీఆర్ఎం వెంట రైల్వే శాఖకు చెంది వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

## ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయాలకు నియామక పత్రాలు

**నియామక పత్రాలు అందజేసిన వైరా ఎమ్మెల్యే**



**కారేపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గంలో గల పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్,ఆయాలు గా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతులమీదుగా నియామక పత్రాలను ఎంపికైన అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించడానికి ప్రీ ప్రైమరీ స్కూళ్లలో ఇన్‌స్ట్రక్టర్,ఆయా పోస్టులను భర్తీ చేసిందన్నారు నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు తమ సేవల ద్వారా ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠతను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దుగ్గిరాల జయరాజ్, సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సింగరేణి సర్పంచ్ మేదరి టోనీ, బీసీ సెల్ నాయకులు బోళ్ళ రమేష్, కిసాన్ సెల్ నాయకులు కడియాల సుధాకర్, జిల్లా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యూజె జిల్లా నేత మోదుగు ప్రభాకర్ రావుకు సన్మానం

**శాలువా కప్పి సన్మానిస్తున్న సీనియర్ జర్నలిస్టులు**



**జూలూరుపాడు, మహా:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజెయు) సంఘం జిల్లా సభ్యుడిగా నియమితులైన ఆంధ్రప్రభ రిపోర్టర్ మోదుగు ప్రభాకర్ రావు ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల భద్రాచలం పట్టణంలో అక్షయ ఫంక్షన్ హాల్లో టీయు డబ్ల్యూజె, ఐజెయు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ సమక్షంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు జెవి రత్నం, ప్రధాన కార్యదర్శి జూనుమల రమేష్ తోపాటుగా మోదుగు ప్రభాకర్ రావును జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. జూలూరుపాడు మండలం నుంచి జిల్లా కమిటీలో స్థానం పొందిన ప్రభాకర్ రావును సహచర సీనియర్ జర్నలిస్టులు, మిత్రులు శాలువ కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, మిత్రులు షేక్ సిద్దిక్, బోడ వీరన్న, గోపాలరావు, ముత్తినేని బాబీ తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ రైలు మార్గంపై రైతుల్లో ఆందోళన..

**మొయినాబాద్ మీదుగా ముంబయి కారిడార్‌కు మార్కింగ్‌లు.. భూసేకరణపై సందిగ్ధం**



**మొయినాబాద్ మహా:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా శంషాబాద్ -ముంబయి కారిడార్‌కు సంబంధించి మొయినాబాద్ మండలంలో మార్కింగ్‌లు చేపట్టడం రైతుల్లో ఆందోళనకు దారితీసింది. పంట పొలాల మధ్యగా మార్గాన్ని గుర్తిస్తుండటంతో భూములు కోల్పోతామేమోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించిన మూడు బుల్లెట్ రైలు కారిడార్లలో శంషాబాద్ -ముంబయి, హైదరాబాద్-అమరావతి -చెన్నై, హైదరాబాద్ -బెంగళూరు మార్గాలు తెలంగాణ మీదుగా వెళ్లనున్నాయి. ఇందులో శంషాబాద్ -ముంబయి కారిడార్ బహదూర్‌గూడ నుంచి ప్రారంభమై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా వెళ్లనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులో భాగంగా శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ, సుల్తాన్‌పల్లి, కేబీదొడ్డి గ్రామాలతో పాటు మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్, సురంగల్, కేతిరెడ్డిపల్లి ప్రాంతాల్లో రైల్వే సిబ్బంది మార్కింగ్‌లు చేపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. సుమారు ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకచోట గుర్తులు వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం విస్తృత స్థాయిలో భూసేకరణ జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదిత మార్గం వ్యవసాయ భూముల గుండా వెళ్తుండటంతో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. భూములు సేకరిస్తే పరిహారం, పునరావాసంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అయితే ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్, భూసేకరణ వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అధికారులు అధికారికంగా ప్రకటించే వరకు మార్గం, భూసేకరణకు సంబంధించిన వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మృతి..

**రాజేంద్రనగర్ మహా ;** ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డెంటల్ డాక్టర్ మృతి చెందగా స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు ఈ సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ కు చెందిన అమూల్య (21) ఏంఎస్ఆర్, డెంటల్ కాలేజీలో చదువుతూంది. మంగళవారం తెల్లవారుజామున ఆమె స్నేహితుడు సిద్ధార్థ తో కలిసి కారులో శంషాబాద్ వైపు వెళుతూ పెద్ద గోల్కొండ ఎగ్జిట్ టోల్గేట్ దాటిన సమయంలో టీఎస్ 09 ఈ ఎక్స్ 4976 నంబరు గల కారు అదుపుతప్పి రోడ్డు కుడివైపున డివైడర్ను ఢీ కొని పల్టీలు కొట్టి అవతల వైపు రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో అమూల్య తలకు చేతులకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కారులో ఉన్న సిద్ధార్థ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలు తండ్రి అద్దంకి మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## సహకార రంగంలో సరికొత్త సంకేతాలు

- నాన్-అఫీషియల్ పీఐసీ' కమిటీ నియామకాలు
- వరంగల్ జిల్లా నల్లబెల్లితోనే షురూ..!
- రాష్ట్ర రాజకీయాల్లో సహకార రంగం పై చర్చ
- ఎమ్మెల్యేల సిఫారసులే కీలకమా.? ఆశావహుల్లో పెరిగిన పోటీ!
- పీఏసీఎస్ కమిటీల నియామకం పై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ!

**మహా వరంగల్ బ్యూరో ;** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ సహకార సంఘాల్లో లో సరికొత్త మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇందుకు వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిణామాలు రాష్ట్రవ్యాప్త రాజకీయ చర్చకు దారితీశాయి. ప్రస్తుత పర్సన్‌ఇన్‌ఛార్జ్ కమిటీని రద్దు చేసి, ప్రభుత్వం కొత్తగా 'నాన్‌అఫీషియల్ పీఐసీ' కమిటీని నియమించడం సహకార రాజకీయాల్లో పెను మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం, ఆడిట్ అభ్యంతరాలు, నిధుల వినియోగంలో లోపాలను పేర్కొంటూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, రాష్ట్రంలోని మిగతా పీఏసీఎస్‌లకు కూడా ఓ హెచ్చరికగా భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాల విభజనతో పాటు సభ్యత్వాల మార్పులు జరగాల్సి ఉండటంతో, ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. సుమారు 900 కు పైగా ఉన్న పీఏసీఎస్‌లలో వేలాది నామినేటెడ్ పదవులు భర్తీ కావాల్సి ఉంది. ఈ క్రమంలో ఎన్నికలు జరగనంత కాలం 'పర్సన్‌ఇన్‌ఛార్జ్' (పీఐసీ) కమిటీల ద్వారానే పరిపాలన సాగించాలనే ప్రభుత్వ నిర్ణయం, అధికార పార్టీలోని ఆశావహుల్లో ఆశలను రేకెత్తిస్తోంది.

**నల్లబెల్లితోనే షూరునా.?**

తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 32(7)(ఏ) ప్రకారం వరంగల్ జిల్లా నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో ఆడిట్ అభ్యంతరాలు, రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం వంటి కారణాలతో ప్రస్తుత కమిటీని రద్దు చేసి, ప్రభుత్వం కొత్త 'నాన్‌అఫీషియల్ పర్సన్‌ఇన్‌ఛార్జ్ (పీఐసీ)' కమిటీని నియమించింది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సహకార రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఇది కేవలం ఒక సంఘానికి పరిమితమైన నిర్ణయం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న పీఏసీఎస్ నామినేటెడ్ కమిటీల నియామకాలకు, ముఖ్యంగా పునర్వ్యవస్థీకరణ పూర్తయ్యే వరకు ఆయా సంఘాల పాలనను ఈ కమిటీలకే అప్పగించే ప్రభుత్వ విధానానికి సంకేతంగా సహకార, రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**పనితీరుపై ఆడిట్.. ప్రమాణాలు మారతాయా?**

నల్లబెల్లి ఉదంతం నేపథ్యంలో రాబోయే రోజుల్లో నామినేటెడ్ కమిటీల నియామకానికి కేవలం రాజకీయ ప్రాధాన్యత మాత్రమే కాకుండా, 'పనితీరు' ప్రామాణికంగా ఉండబోతోందనే చర్చ జరుగుతోంది. రుణాల వసూళ్లు, ఆడిట్ నివేదికలు, రైతులకు అందుతున్న సేవలు, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పదవులు కట్టబెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సహకార సంఘాలను కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మలచాలనేది ప్రభుత్వ ఉద్దేశమని సహకార శాఖ వర్గాలు చెబుతున్నాయి.

**ముదురుతున్న రాజకీయాలు**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 150కి పైగా సంఘాల్లో కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ల నియామకంపై పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఎమ్మెల్యేలు సూచించిన వారికే పదవులు దక్కుతాయన్న సంకేతాలతో నియోజకవర్గాల్లో పట్టు కోసం నేతలు పైరవీలు మొదలుపెట్టారు. సహకార రంగానికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా, ఈ నియామకాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా, నల్లబెల్లి నిర్ణయం మిగతా జిల్లాల్లోని సహకార సంఘాలకు మార్గదర్శిగా మారుతుందా లేక కేవలం ఒకే చోటికి పరిమిత మవుతుందో వేచి చూడాల్సిందే.!

## స్మశాన వాటిక ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**తహసీల్దార్ కు ముస్లింల వినతి**

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండల లింగంబంజరలోని ముస్లిం స్మశాన వాటికను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక మసీద్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ముస్లిం స్మశాన వాటికలో లింగంబంజరకు చెందిన పురం అంజయ్య, రామరాజు అనే వ్యక్తులు జెసిబి ని పెట్టి గుంటలు త్రవ్వించడం వల్ల పూర్వీకుల సమాధులు ధ్వంసమయ్యాయని వినతి లో తెలిపారు. రెవిన్యూ శాఖ అధికారులు స్పందించి ముస్లిం స్మశాన వాటికను సందర్శించి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ ను కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో మసీదు కమిటీ సభ్యులు షేక్ సైదులు, ఎస్.కె మీరా, షేక్ రంజాన్, గౌస్, సలీం, సైదులు, అబూబకర్, ఖాజావలి, హుస్సేన్ సాహెబ్, సైజ్ జాన్, సోన్, ఖాసీం, జాన్, జానీ, నజీర్, పాష తదితరులు ఉన్నారు.

## ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగరడం తథ్యం.

- మోదీ సుపరిపాలనతోనే ఖమ్మం అభివృద్ధి.
- కాంగ్రెస్, కమ్యూనిస్టులవి అవకాశవాద రాజకీయాలు.
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు




**వైరా, జులై 14:** దశాబ్దాలుగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల అవకాశవాద రాజకీయాలకు బలైపోయిన ఖమ్మం జిల్లాలో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నేతలు శక్తివంచన లేకుండా పని చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ గౌతమ్ రావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా వైరాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, కమ్యూనిస్టుల అవకాశవాద రాజకీయాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఖమ్మం పోరాట గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు. కార్యక్రమం కు ముందు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కార్యవర్గ సమావేశం లో రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు జిల్లా పార్టీ చేసిన కార్యాచరణ అంశాలపై తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

దశాబ్దాలుగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్, కమ్యూనిస్టుల స్వార్థ రాజకీయాలకు బలైపోయిందని గౌతమ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక చైతన్యం ఉన్న ఈ గడ్డపై కార్మికులు, కర్షకుల పేరుతో రాజకీయాలు చేసిన కమ్యూనిస్టులు నేడు తమ సిద్ధాంతాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. కేవలం కొన్ని పదవుల కోసం, తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం ఎర్ర జెండా నాయకులు అధికార కాంగ్రెస్‌తో అంటకాగుతూ ప్రజల నమ్మకాన్ని నడివీధిలో వమ్ము చేశారని విమర్శించారు. ఈ రెండు పార్టీల అపవిత్ర కలయిక వల్ల సామాన్యుల తలరాతలు ఏమాత్రం మారలేదని, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఏమాత్రం పనికిరాని ఈ నకిలీ కామ్రేడ్లు, అవినీతి కాంగ్రెస్ నాయకులు ఖమ్మం జిల్లాను తమ గుప్పిట్లో పెట్టుకుని శాసించాలని చూస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్రంలో ఇలాంటి వినాశకర పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, ఖమ్మం జిల్లాకు ఏకైక ప్రత్యామ్నాయ శక్తి భారతీయ జనతా పార్టీ మాత్రమేనని గౌతమ్ రావు స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, ఆ నిస్వార్థ అభివృద్ధి ఫలాలు ఖమ్మం గడపకు కూడా చేరుతున్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి రాజకీయ వివక్ష లేకుండా వేల కోట్ల రూపాయలతో మన జిల్లా మీదుగా జాతీయ రహదారులను నిర్మిస్తూ, ఖమ్మం రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని గుర్తుచేశారు. పేదల పక్షపాతిగా మోదీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు దళారులు, అవినీతికి తావులేకుండా నేరుగా నిరుపేద లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కుల మతాల మధ్య చిచ్చుపెట్టి చౌకబారు రాజకీయాలు చేస్తుంటే, బీజేపీ 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' నినాదంతో ముందుకు సాగుతోందన్నారు.ఖమ్మం జిల్లాలోని గిరిజనులు, దళితులు, బీసీలు, ఇతర అణగారిన వర్గాల నిజమైన ఆత్మగౌరవం బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆయన పార్టీ శ్రేణులకు వివరించారు. దశాబ్దాలుగా గిరిజనులను వేధిస్తున్న పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నా, సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా, సింగరేణి కార్మికుల కష్టాలు తీరాలన్నా అది పారదర్శకమైన, అవినీతి రహితమైన బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను గ్రహించి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ప్రతి గడపకూ, ప్రతి తండాకూ వెళ్లి మోదీ ప్రభుత్వ అభివృద్ధి సందేశాన్ని బలంగా వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు వాకధాని పుల్లారావు యాదవ్, నంబూరి రామలింగేశ్వరరావు, సన్నీ ఉదయ ప్రతాప్, గోగూర వెంకటేశ్వర్లు, గల్లా సత్యనారాయణ, ఇవి రమేష్, రుద్ర ప్రదీప్, దొంగల సత్యనారాయణ, చిలుకూరి రమేష్,నున్న రవికుమార్, మండడపు సుబ్బారావు, మేకల నాగేందర్, గుత్తా వెంకటేశ్వర్లు,నాయుడు రాఘవరావు, బండారు నరేష్, శ్యామ్ రాథోడ్, మంద సరస్వతి,బోయలు వెంకట్, పమ్మీ అనిత, వీరవల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** సింగరేణి కాల్ బెల్ట్ పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లాకు వస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు

## కాంగ్రెస్ నాయకుడు సాయితిరుమల్ గౌడ్ మృతి

**అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**తక్కళ్లపల్లి, జూలై 14 (మహా):** పాలకుర్తి మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పొన్నం సాయితిరుమల్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్వయంగా పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఐక్యతే బలం...



ఎప్పుడు రాజకీయాలేనా... వాటిని కాస్త పక్కన పెడదాం. రాష్ట్ర అవసరాలు చాలా వున్నాయి. అభివృద్ధి అంశాలు పెండింగ్ లో పడ్డాయి. కేంద్రం నుంచి మనకు సహకారం, సహాయం రెండు అవసరం. వీటిపైన ఇప్పుడు దృష్టి పెడదాం. మన రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టిదాం. ఇందుకు మీ వంతు బాధ్యత మీరు నిర్వహిం చండీ. నా ప్రయత్నం నేను గట్టిగా చేస్తా. రాష్ట్ర ప్రాధాన్య తలను కేంద్రానికి అర్థం అయ్యేలా మనం ముందుకు సాగాలి. ఇది తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఎం పీలకు చేసిన సూచనలు. వర్షా కాలం పార్లమెంట్ సమావేశాలు మొదలు అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎం పీలకు సీఎం కర్తవ్యం మరోసారి గుర్తు చేశారు. ఇక్కడి తో ఆయన వదిలి వేయలేదు. తెలంగాణ ప్రాంతంలో కేంద్రం సహాయంతో ముందుకు సాగాల్సిన అభివృద్ధి అంశాలను వరుస క్రమంలో చెప్పుకుని వచ్చారు. రా జకీయాలు ఎప్పుడు ఉండేవే. వాటి కన్నా రాష్ట్ర ప్రగతి ముఖ్యం. అభివృద్ధి జరిగితేనే ప్రజలకు మేలు చేకూరు తుంది. ఆ దిశగా మనం అడుగులు వేయాలంటూ ఎం పీలను కోరిన సీఎం ఢిల్లీలో సాధించుకోవల్సిన పనులు ఏమిటో చెప్పుకుని వచ్చారు.

ఎప్పుడు పార్లమెంట్ సమావేశాలు జరిగిన రాష్ట్ర ప్ర యోజనాల ప్రాధాన్యతలను ఆయా రాష్ట్రాల సీఎం రాష్ట్ర ఎం పీలకు గుర్తు చేయటం సహజం. అయితే సీఎం వివరించిన రాష్ట్ర ప్రయోజనాల సాధనలో ఎం, పీ లు ఎంత మేరకు శ్రద్ధ తీసుకొని ప్రయత్నం చేస్తున్నారన్నదే ఇక్కడ పాయింట్. ప్రస్తుతం తెలంగాణ సీఎం ఎం, పీ ల సమావేశంలో ప్రస్తావనకు తెచ్చిన అనేక అంశాలలో ఒకటి, రెండు మినహాయించి మిగితావన్నీ పాతవే. మరి పాత ప్రాధాన్యతలు ఎం, పీలు ఎందుకు సాధించుకో లేక పోయారు. కేంద్రం నుంచి సహాయం ఎందుకు రాబట్టలేక పోయారు అనేదే ఇక్కడ ఓ సందేహం. ఇందులో ఎం, పీ ల ప్రయత్నం లేదని చెప్పలేం. రాష్ట్రా నికి కావాల్సిన ప్రయోజనాల జాబితా పట్టుకొని ఎం, పీ లు కేంద్రంలోని ఆయా శాఖల మంత్రులను కలుస్తూనే వున్నారు. కేంద్ర మంత్రులు ఆ వినతి పత్రాలు తీసుకొని తలలు ఊపుతూనే వున్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్ర యోజనాల పైన సానుకూల సంకేతాలు వచ్చాయని రాష్ట్ర ఎం, పీలు ప్రకటనలు చేస్తూనే వున్నారు. ఇదంతా ఓ ప్రవసనంగా సాగిపోవటం చూస్తూనే వున్నాం. కానీ కేంద్రం దృష్టికి రాష్ట్ర ఎం, పీలు తీసుకొని వెళ్తున్న రాష్ట్ర అవసరాల జాబితాలో మహా అయితే ఒకటి, రెండు మాత్రమే కాస్త ముందుకు సాగుతున్నాయి. మిగిలి నవన్నీ వినతి పత్రాలకే పరిమితమవుతున్నాయి. ఈ సారి రాష్ట్ర ఎం, పీలు ఓ గట్టి పట్టు పడితే తప్పా రాష్ట్ర ప్రయోజనాల జాబితాలోని కొన్ని అంశాలపైన అయినా కేంద్రం దృష్టి పెట్టే అవకాశం వుంది.ఇందుకు కారణం లేక పోలేదు. తెలంగాణ పైన బీజేపీ కన్నేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయాలనే ప్ర యత్నంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణకు ఎంతో కొంత కేంద్రం నుంచి సహాయం, సహకారం లభించే అవకాశం పుష్కలంగా వుంది. దీన్ని రాష్ట్ర ఎం, పీలు సమయానుకూలంగా వాడుకోగ లిగితే తెలంగాణకు కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహాయం అందుతుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రాధాన్యతల్లో ముఖ్యమైన అంశాలు చాలా వున్నాయి.ఇందులో నదుల అనుసంధానం ఒకటి. గోదావరి నుంచి నాగార్జున సాగర్ కు నీటిని తరలించే ప్రతిపాదన తెలంగాణ సర్కార్ కు వుంది. దీనికి ఛత్తిస్ గాడ్ అనుమతి కావాలి. ఆ రాష్ట్రాన్నీ ఒప్పించి గోదావరి, కృష్ణా అనుసంధానం చేసిందుకు కేంద్రం ఒప్పుకుంది. ఛత్తిస్ గడ్ వాడుకోని 160 టీ ఎం సీ గోదావరి నీటిని తెలంగాణ కోరుకుంటోంది. ఇందులో ఎంతో కొంత నీరు తెలంగాణకు వస్తే అది రాష్ట్ర రైతాంగానికి వరంగా మారుతుంది. తమిళ నాడు,కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు కూడా దీని వల్ల ప్ర యోజనం ఉంటుందన్న విషయం గుర్తు చేసిన సీఎం గోదావరి, కావేరి అనుసంధానం గురించి కూడా రాష్ట్ర ఎం, పీలకు స్పష్టత ఇచ్చారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రయోజనం గుర్తు పెట్టుకొని తల పెట్టిన ప్రా జెక్ట్ లకు కూడా మోక్షం రావాల్సిన అవసరం ఇక్కడ ఆయన ప్రస్తావనకు తెచ్చారు.హైదరాబాద్, ముంబై, బెంగళూరు బుల్లెట్ రైళ్లు,ఆదిలాబాద్,వరంగల్ ల్లో విమానాశ్రయాల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా కేంద్రం పైన వత్తిడి తీసుకొని రావా ల్సిన అవసరం, ఆవశ్యకత సీఎం రేవంత్ గుర్తు చేశారు. దేశంలోనే కాదు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ నగరం వుంది. హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తోంది. పెట్టు బడిదారులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. విద్యా, వైద్యం, వ్యాపారం, వాణిజ్య కార్యక్రమాలకు హైదరాబాద్ ఓ కేంద్ర బిందువు అయింది. ఇప్పటికే కోటిన్నరకు పైగా జనాభా హైదరాబాద్ ఖాతాలో చేరింది. మరో అయిదు సంవత్సరాలలో ఇది మూడు నుంచి అయిదు కోట్ల మేరకు చేరే అవకాశం వుంది. ఈ నేపథ్యంలో హైదరా బాద్ అభివృద్ధి అనివార్య మవుతోంది. ప్రజలకు మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్ద పీట వేయకతప్పట్లేదు. భవిష్యత్ లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు అయితే నగర ప్రజల అవసరాలు మరింతగా పెరిగిపోతాయి. దీన్ని పరిగణ లోకి తీసుకునే తెలంగాణ ప్రభుత్వం మెట్రో రెండో దశ పనులు చేపట్టెందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి అవసరమైన నిధుల ఏర్పాటుకు కేంద్ర సహకారం తప్ప నిసరిగా ఉండాలి. ఈ విషయంలో సీఎం రేవంత్ తన ప్రయత్నం తాను చేస్తూ వస్తున్నారు. మెట్రో రెండో దశ పనులు ట్రాక్ ఎక్కాలి అంటే కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ ఇప్పుడు అవసరం. ఈ విషయం కూడా సీఎం రాష్ట్ర ఎం, పీలకు గట్టిగానే వివరించారు. ఏ రాష్ట్రానికి అయినా పె ట్టుబడులు రావాలి అంటే ట్రాన్స్పోర్ట్ సిస్టం బాగుండాలి. అప్పుడే పెట్టుబడిదారులు ముందుకు వస్తారు. పరిశ్ర మలు, సంస్థలు ఏర్పాటు అవుతాయి. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి. ఉపాధి, ఉద్యోగాలకు మార్గం ఏర్పడుతుంది. ఈ విషయం వివరంగా సీఎం రేవంత్ రాష్ట్ర ఎం, పీ లకు చెప్పుకుంటూ వస్తూనే మెట్రో రెండో దశ ఆవశ్యకత తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డికి మరో ప్రాధాన్యత అంశం కూడా వుంది. అదే మూసీ సుందరీకరణ. మూసీ ప్రక్షాళన జరిగితే హైదరాబాద్ నగరం ఓ అద్భుతమైన సిటీగా మారిపోతుందన్నది సీఎం మాట. పర్యావరణ పరిరక్ష ణతో పాటు, పర్యాటక రంగం అభివృద్ధి మూసీ ప్రక్షాళ నతో సాధ్యం అవుతుందని సీఎం అంటున్నారు. కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో కాక పోయినా ఎంతో కొంత సహకారం అందితే మూసీ ప్రక్షాళన యుద్ధ ప్రాతిపది కన చేయాలనే సంకల్పంతో వున్న రేవంత్ ఈ అంశం కూడా రాష్ట్ర ఎం, పీల దృష్టిలో పెట్టారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సహాయం రాబట్టుకోవటంలో రాష్ట్ర ఎం, పీలు ఐక్యతరాగం అనుసరించి అడుగు వేయాలన్నది రేవంత్ సూచనగా స్పష్టంగా అర్థం అవుతోంది. అందుకే ఆయన ఇక్కడ ఓ విషయం కూడా ప్రస్తావించారు. అభివృద్ధి అంశాల్లో రాజకీయాలకు తావే లేదన్నారు. అక్కడితో ఆయన ఆగిపోలేదు. ఎం. పీ ల మీటింగ్ లో విపక్షాలకు చెందిన ఎం, పీ లు చేసిన సూచనలు కూడా ఆయన పరిగణలోకి తీసుకున్నారు. ఐక్యమత్యం మహా బలం. ఇందులో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎం, పీ లు రాజకీయా లకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల సాధనకు కృషి చేస్తే తెలంగాణ ఓ రేంజ్ లో ప్రగతి వైపు పరుగులు తీస్తుంది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తమిళనా డులో రాజకీయ పార్టీలన్నీ ఏకతాటి పైకి వస్తాయి. అదే స్ఫూర్తి తెలంగాణ ఎం, పీల్లో వస్తే సాధించ లేనిది ఏది లేదు. ఇప్పుడు తెలంగాణ ఎం, పీ లు రాష్ట్ర ప్రయోజ నాల సాధన కోసం ఢిల్లీలో ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. కలిసికట్టుగా ఉండి కేంద్రంతో పని చేయిం చుకునే తరహాలో వెడతారా, లేక ఎప్పటిలాగా ఎవరికీ వారేగా వ్యవహరించి రాష్ట్ర ప్రయోజనాలపైన నామ మాత్ర ప్రయత్నాలు మాత్రమే చేస్తారా అన్నది చూడాలి. రాష్ట్ర ఎం, పీలకు కూడా రాష్ట్ర అభివృద్ధి జరిగితేనే రాజకీ యంగా ప్రయోజనం ఉంటుంది. ఇది వారికి తెలియని విషయం ఏమి కాదు. ఇక్కడ వ్యక్తిగత క్రెడిట్ ను కాస్త పక్కన పెట్టి ఎం, పీ లు ఈ మంచి ఆలోచనతో ఐక్యత భావం ప్రదర్శిస్తే తెలంగాణ రాష్ట్రానికి వారు బంగారు భవిష్యత్ వేసిన వారు అవుతారు. ఆ దిశగానే వారు అడుగులు వేయాలన్నదే ప్రజల ఆశ కూడా. ఇప్పుడు రాష్ట్ర ఎం పీ ల పైన ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. వారికి మేలు చేస్తే రాష్ట్ర ఎం, పీ లు ప్రజల హృదయాల్లో గొప్ప నేతలుగా ఉండి పోతారు. కేంద్రం కూడా వెనక్కి తగ్గకుండా తెలంగాణ ప్రగతికి చేయూతనిస్తుంది. ఇదే జరగాలి. అదే తెలంగాణ ప్రజల ఆశ, ఆకాంక్ష...



**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**

---

# హరిత విప్లవమా... అమెరికా విష వలయమా?

## ఆనాటి ప్రభుత్వ ఆహార భద్రతా నిర్లక్ష్యం, వైఫల్యం

భారతదేశ చరిత్రలో 'హరిత విప్లవం' అనగానే మనకు వ్యవసాయ శాస్త్రవేత్తల ఆవిష్కరణలు, దేశంలో ఆహార ఉత్పత్తి పెరిగిన వైనం మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ, ఆ పచ్చని విప్లవం వెనుక దాగి ఉన్నది ఒక భయంక రమైన అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ క్రీడ. ఇది కేవలం వ్యవసాయ విధానం కాదు, ఆకలితో అలమ టిస్తున్న ఒక దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి అమెరికా పన్నిన పద్మవ్యూహం. నాటి భారత రాజకీయ నాయకుల దీర్ఘకాలిక వైఫల్యాలు, ముందుచూపు లే కపోవడం అమెరికా సామ్రాజ్యవాదానికి ఎలా రెడ్ కార్పెట్ పరిచాయో విశ్లేషిస్తే కళ్లు చెదిరే చేదు నిజాలు వెలుగులోకి వస్తాయి.

**భూసంస్కరణలను గాలికి వదిలేసిన వైనం**

స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలోని అత్యధిక వ్యవ సాయ భూమి కొద్దిమంది జమీందారుల చేతుల్లోనే ఉండిపోయింది. నవ భారత నిర్మాణానికి పునాదులు వేశారని కీర్తించబడే జవహర్‌లాల్ నెహ్రూ, వ్య వసాయ రంగంలో మాత్రం తీవ్ర విధానపరమైన లోపాలకు కారణమయ్యారు. నిజాయితీగా కష్టపడే సన్నకారు రైతులకు భూమిని పంచే 'భూసంస్కరణలు' పక్కాగా అమలు చేసి ఉంటే, భారతదేశ ఉత్పాదకత సహజంగానే పెరిగేది. కానీ, రాష్ట్ర స్థాయిలో ఉన్న బడా భూస్వాములను, తమ ఓటు బ్యాంకును ఎదిరించే ధైర్యం లేక ఆ చట్టాలను నీరుగార్చారు.



రెండవ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయం కంటే భారీ పరిశ్రమలు, పెద్ద డ్యామ్‌లకే ప్రాధాన్యతనిచ్చి క్షేత్రస్థా యి రైతును గాలికి వదిలేశారు. సంప్రదాయ విత్తనాల అభివృద్ధి, స్థానిక నీటిపారుదల వ్యవస్థలను పట్టించు కోలేదు. ఆనాడే దేశ వ్యవసాయాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించకుండా, అమెరికా ఇచ్చే గోధుమలపై ఆధారపడే దౌర్భాగ్య స్థితికి నాంది పలికారు.

**ఆకలి మంటలపై కార్పొరేట్ రాబందుల వాలకం**

1960ల నాటికి ఆసియాలో (ముఖ్యంగా చైనా, వియత్నాం) కమ్యూనిజం వేగంగా విస్తరిస్తోంది. భారతదేశంలో ఆకలి చావులు ఇలాగే కొనసాగితే, ఇక్కడి పేద ప్రజలు కూడా ఎర్ర జెండా పట్టి తిరుగు బాటు చేస్తారని అమెరికా గ్రహించింది. పేదరికాన్ని రూపుమాపడం కంటే, కమ్యూనిజాన్ని అడ్డుకోవడానికే అమెరికా ఈ 'హరిత విప్లవాన్ని' మనపై ప్రయోగించిం ది.కరువు సమయంలో భారతదేశం అమెరికా పంపే 'పీఎల్ 480' గోధుమలపై ఆధారపడటాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు లిండన్ బి. జాన్సన్ ఒక దౌత్య ఆయుధంగా మలుచుకున్నారు. దీర్ఘకాలిక ఒప్పందా లు చేయకుండా, నెలనెలా కొద్దిగా ధాన్యాన్ని పంపుతూ 'షార్ట్‌టెథర్' విధానంతో భారత ప్రభుత్వానికి ఊపిరి ఆడకుండా చేశారు. ఇది దౌత్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయం.

వియత్నాం యుద్ధాన్ని నాటి ప్రధాని ఇందిరా గాంధీ విమర్శించినప్పుడు, ఆహార సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామని అమెరికా బ్లాక్‌మెయిల్ చేసింది. ఆకలిని ఆయుధంగా వాడుకుని, పాశ్చాత్య దేశాల విత్తనాలు, ఎరువులకు భారత మార్కెట్లను తెరిచేలా అత్యంత నీచంగా ఒత్తిడి తెచ్చింది. హరిత విప్లవం పూ ర్తిస్థాయిలో అమలైంది ఇందిరా గాంధీ హయాంలోనే. ఆమె ప్రధాని అయ్యేనాటికి దేశం తీవ్ర కరువు కోరల్లో చిక్కుకుంది. 1965 పాకిస్తాన్ యుద్ధంతో ఖజానా ఖాళీ అయింది, ఆహార నిల్వలు అడుగంటాయి. ఆ దశలో దేశంలో ఆకలి చావులను ఆపడం మినహా ఆమె ముందు మరో మార్గం లేదు. అదే అదనుగా అమెరికా పెట్టిన షరతులకు తలొగ్గి, విదేశీ బహుళజా తి కంపెనీల పెట్టుబడిదారీ వ్యవస్థకు దేశ మార్కెట్లను ఇందిర ప్రభుత్వం బార్లా తెరిచింది.

రాక్‌ఫెల్లర్, ఫోర్డ్ ఫౌండేషన్ల ముసుగులో వచ్చిన కార్పొ రేట్ సామ్రాజ్యవాదానికి నాటి ప్రభుత్వం తలొగ్గింది. ఫలితంగా, వందల ఏళ్లుగా పశువుల పేడ, వేపపిండి, దేశవాళీ విత్తనాలతో స్వతంత్రంగా ఉన్న భారత వ్యవసాయ రంగం... ప్రతి ఏడాదీ విత్తనాలు, పురు గుమందుల కోసం విదేశీ కార్పొరేట్ల చేతుల్లో బందీ అయిపోయింది.

**విషతుల్యమైన నేలలు... క్యాన్సర్ రైళ్లు!**

హరిత విప్లవం తీసుకువచ్చిన తర్వాత రసాయన ఎరువులు, విపరీతమైన భూగర్భ జలాల వాడకంపై ఎలాంటి నియంత్రణలు విధించాలో అప్పటి ప్రభుత్వా లు ఏమాత్రం ఆలోచించలేదు. ఈ విధానపరమైన అం ధత్వమే నేటి వ్యవసాయ విధ్వంసానికి మూల కారణం. కార్పొరేట్ లాభాపేక్షతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం అమాంతం పెరిగిపోయి, లక్షలాది మంది చిన్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. నేలలు ఎడారులుగా మారుతున్నాయి. పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో భూగర్భ జలాలు విషతుల్యమై ఏకంగా ఒక ఊరి నుండి ఆసుప త్రులకు క్యాన్సర్ రైళ్లు నడిచే స్థాయికి ప్రజల ఆరోగ్యం దిగజారిపోయింది.హరిత విప్లవం అనేది కేవలం ఒక వ్యవసాయ విధానం కాదు, అదొక భయంకరమైన రాజకీయ, దౌత్యపరమైన రాజీ. ఆకలితో అలమటి స్తున్న ప్రజల ప్రాణాలు నిలపడానికి ఆ క్షణానికి ఆ నిర్ణయం అనివార్యం కావచ్చు. కానీ, ఒక జాతి ఆహార భద్రతను విదేశీ శక్తుల చేతుల్లో పెట్టడం, భూసంస్కర ణలు అమలు చేయలేక సాంకేతికత వెనుక దాగడం ఎంతటి ఘోరమైన చారిత్రక తప్పిదమో చెప్పడానికి... ఆనాటి పాలకుల చేతకానితనానికి, విదేశీ వ్యవసాయ మాఫియాకు నేటికీ బలిపశువవుతున్నది మాత్రం మన అన్నదాతలు వారిపై ఆధారపడిన ప్రజలే..


**(గడల నరసింహారావు,**
**సీనియర్ జర్నలిస్ట్)**

---

# చర్మ సంరక్షణలో ఈ పొరపాట్లు చేయొద్దు

**ప్రకటనలు చూసి ఉత్పత్తులు వాడితే చర్మానికే ముప్పు.. నిపుణుల హెచ్చరిక**

నేటి ఆధునిక జీవనశైలిలో అందంగా కనిపించాల నే ఆసక్తి ప్రతి ఒక్కరిలో పెరుగుతోంది. ముఖ్యంగా యువత తమ చర్మం కాంతివంతంగా, మృదువుగా ఉండేందుకు వివిధ రకాల సౌందర్య ఉత్పత్తులను ఉప యోగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, ప్రకటనలు, ప్రముఖుల ప్రచారం ప్రభావంతో కొత్తగా మార్కెట్ లోకి వచ్చే ప్రతి ఉత్పత్తిని చాలామంది ఎలాంటి ఆలోచన లేకుండా కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రతి ఉత్పత్తి ప్రతి ఒక్కరి చర్మానికి సరిపోదని, చర్మ స్వభావాన్ని తె లుసుకోకుండా వాడితే లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని చర్మవ్యాధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. చర్మం పొడిబారడం, ఎర్రబడడం, దురద, అలెర్జీలు, మొటిమలు, మచ్చలు, చర్మం సున్నితంగా మారడం వంటి సమస్యలకు కొన్ని సౌందర్య ఉత్పత్తులే కారణమ వుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రకటనల్లో కనిపించే ఆకర్షణీయమైన మాటలను నమ్మి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా, వాటిలోని పదార్థాలు, చర్మానికి అనుకూలత గురించి తెలుసుకో వడం అవసరమని సూచిస్తున్నారు.



**లూఫా వాడకంలో జాగ్రత్త**



స్నానం సమయంలో శరీరాన్ని బాగా శుభ్రం చేస్తుం దనే ఉద్దేశంతో చాలామంది లూఫాలను ఉపయో గిస్తుంటారు. కానీ తేమ ఎక్కువగా ఉండే స్నానాల గదుల్లో లూఫాలో బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. అదే లూఫాను పదేపదే ఉపయోగించడం వల్ల ఆ సూక్ష్మక్రిములు చర్మానికి చేరి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. గట్టిగా రుద్దడం వల్ల చర్మంపై సూక్ష్మ గాయాలు ఏర్పడి సహజ రక్షణ పొర దెబ్బతింటుంది. అందువల్ల లూఫాను తరచూ మార్చడం లేదా మృదువైన గుడ్డను ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

***ప్లాస్టిక్ దువ్వెనలతో జుట్టుకు నష్టం**

చాలామంది ప్రతిరోజూ ప్లాస్టిక్ దువ్వెనలనే ఉపయో గిస్తుంటారు. అయితే ఇవి జుట్టులో స్థిర విద్యుత్‌ను పెంచి జుట్టు చిక్కుకోవడం, విరిగిపోవడం, పొడిబా రడం వంటి సమస్యలకు దారితీస్తాయి. సున్నితమైన తలచర్మం ఉన్నవారిలో దురద, చికాకు కూడా పెరిగే అవకాశం ఉంది. చెక్కతో తయారైన లేదా వెడల్పాటి పళ్లున్న దువ్వెనలు ఉపయోగిస్తే జుట్టు సహజంగా దువ్వుకోవడంతో పాటు విరిగిపోవడం కూడా తగ్గు తుందని నిపుణులు చెబుతున్నారు.

**ముక్కు శుభ్రపరిచే పట్టీలు తరచూ వాడొద్దు**

ముక్కుపై ఉండే నల్ల మచ్చలు తొలగించేందుకు చాలామంది ప్రత్యేక పట్టీలను ఉపయోగిస్తుంటారు. ఇవి తాత్కాలికంగా మురికిని తొలగించినా, చర్మం లోని సహజ నూనెలను కూడా తొలగిస్తాయి. దీంతో చర్మం మరింత సున్నితంగా మారి రంధ్రాలు చికాకుకు గురవుతాయి. కొన్నిసార్లు సమస్య మరింత పెరిగే అవకాశం కూడా ఉంటుంది. అవసరమైతే వైద్యుల సూచనలతోనే ఇలాంటి ఉత్పత్తులు ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**మేకప్ తొలగించే తడి గుడ్డలతో ప్రమాదం**

మేకప్ తొలగించేందుకు ఉపయోగించే తడి గుడ్డలు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ అవి చర్మానికి పూర్తిస్థా యిలో శుభ్రతను అందించవు. చర్మంపై రసాయన అవశేషాలు మిగిలిపోయే అవకాశం ఉంది. వాటిలో ఉండే కొన్ని పదార్థాలు చర్మాన్ని పొడిబారేలా చేసి, సహజ తేమను తగ్గిస్తాయి. దీర్ఘకాలంగా వాడితే చర్మం మసకబారడం, చికాకు, ఎర్రబడడం వంటి సమస్యలు కనిపించవచ్చు. అందుకే సున్నితమైన ముఖ శుభ్రప రిచే ద్రావకాలు లేదా మృదువైన శుభ్రపరిచే పదార్థా లను ఉపయోగించడం ఉత్తమమని నిపుణులు సూచి స్తున్నారు.

**జుట్టు రాలడాన్ని ఒక్క షాంపూ ఆపదు**





మార్కెట్ లో జుట్టు రాలడాన్ని పూర్తిగా ఆపేస్తామని చెప్పే అనేక రకాల షాంపూలు లభిస్తున్నాయి. అయితే జుట్టు రాలడానికి ప్రధాన కారణాలు పోషకాహార లోపం, ఒత్తిడి, హార్మోన్ల మార్పులు, నిద్రలేమి, కొన్ని ఆరోగ్య సమస్యలు కావచ్చని నిపుణులు చెబుతున్నారు. కేవలం ఒక షాంపూ వాడడం వల్ల ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాదని స్పష్టం చేస్తున్నారు. సమతుల ఆహారం, తగిన నిద్ర, మానసిక ప్రశాంతత, వైద్యుల సలహాతో సరైన చికిత్స తీసుకోవడం ద్వారా మాత్రమే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొంటు న్నారు.

**ప్రకటనలకంటే చర్మ అవసరమే ముఖ్యం**

చర్మ సంరక్షణలో అందరికీ ఒకే ఉత్పత్తి సరిపోదు. ఒకరికి ఉపయోగపడినది మరొకరికి హానికరంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ప్రకటనలు, ప్ర చారాలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే సూచనలను గుడ్డిగా అనుసరించకుండా, చర్మ స్వభావాన్ని గుర్తించి నిపుణుల సలహాతోనే ఉత్పత్తులను ఎంపిక చేసుకోవా లి. రోజూ తగినంత నీరు తాగడం, సమతుల ఆహారం తీసుకోవడం, తాజా పండ్లు, కూరగాయలు ఆహారంలో చేర్చుకోవడం, తగిన నిద్రపోవడం, ఎండలోకి వెళ్లేట ప్పుడు చర్మ రక్షణ చర్యలు తీసుకోవడం వంటి అల వాట్లు సహజమైన చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతాయని వైద్యులు సూచిస్తున్నారు.

గమనిక: చర్మం లేదా జుట్టుకు సంబంధించిన ఏ ఉత్పత్తినైనా ఉపయోగించే ముందు అర్హత కలిగిన వైద్య నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం. ప్రతి ఒక్కరి చర్మ స్వభావం భిన్నంగా ఉండేందున ఇతరులకు సరి పోయిన ఉత్పత్తి మీకు కూడా సరిపోతుందనే భావనతో వాడకూడదు.





## ఎల్‌నినో ఎఫెక్ట్ పాలకుర్తి రైతులకు
# వ్యవసాయ శాఖ కీలక ప్రకటన



**పాలకుర్తి జూలై 14 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం ప్రస్తుత వానాకాలం 2026 సీజన్‌లో ఎల్‌నినో దుష్ప్రభావాల కారణంగా వర్షపాతం తీవ్రంగా తగ్గే అవకాశం ఉన్నందున రైతులెవరూ వరి సాగు జోలికి వెళ్లవద్దని పెద్దపల్లి జిల్లా యంత్రాంగం మరియు వ్యవసాయ శాఖ హెచ్చరించాయి. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి సమీక్షా సమావేశం నిర్వహించిన పంటలపై ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.ఈ కష్టకాలంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు తక్కువ నీటితో,తక్కువ రోజుల్లో పండే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.గత సంవత్సరంతో పోలిస్తే పాలకుర్తి మండలంలో ఇప్పటివరకు 35% తక్కువ వర్షపాతం నమోదైంది. మండలంలోని నీటి వనరుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారింది మండలంలో 5 పెద్ద చెరువులలో 3 చెరువులు కేవలం 25% మాత్రమే నిండాయి.37 చిన్న చెరువులలో 26 చెరువులు కేవలం 50% మాత్రమే నీటితో నిండాయి.జలాశయాలు నిండని పక్షంలో కాలువలు, చెరువుల ద్వారా సాగునీరు అందించే పరిస్థితి ఉండదని అధికారులు స్పష్టం చేశారు.రైతు సోదరులందరూ వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థిక నష్టాల నుంచి తప్పుకోవాలని పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి కోరారు.

# నక్ష సర్వే కార్యక్రమం పరిశీలించిన జిల్లా కలెక్టర్



**యాదాద్రి భువనగిరి జూలై 14 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్ష సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి రెవెన్యూ కలెక్టర్ వెంకట రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. మంగళవారం యాదగిరిపల్లిలో అధికారులు సర్వే బృందాలు వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, నివాస గృహాలు, ప్లాట్ల వాస్తవ హద్దులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా నిర్ధారిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ యజమానుల సమక్షంలో హద్దులను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నక్షా సర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రతి సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో భూ యజమానులకు పూర్తి సమాచారం అందిస్తూ, వారి అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యతతో, వేగవంతంగా నక్షా సర్వేను పూర్తి చేసి ప్రతి ఆస్తికి ఖచ్చితమైన హద్దులను నిర్ధారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి సుజాత,సర్వే బృందాల సిబ్బంది, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొరిగె నరసింహ ఆశయాలను
# కొనసాగించాలి

**భువనగిరి జులై 14 మహా న్యూస్** :యాదాద్రి భువనగిరి జిల్లా సివిల్ సప్లై అమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగె నరసింహ ఆశయాలను కొనసాగిస్తూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్ రావు పిలుపునిచ్చారు మంగళవారం రాయన్నపేట మండల కేంద్రంలో సివిల్ సప్లై గోదాం ప్రాంగణంలో గొరిగెనరసింహ సంతాప సభ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిపిఐజిల్లా కార్యదర్శి యాసాల దామోదర్ రెడ్డి ఏఐటియుసి మండల అధ్యక్షులు బత్తుల సత్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్ పెల్లి శంకర్ సామల శోభన్ బాబు సివిల్ సప్లై యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి ఊటుకూరు నరసింహ సిపిఐ జిల్లా నాయకులు ఎగ్గ రమేష్ యాదగిరి నమ్ముయ్య గుండె శంకరయ్య జగన్ కొండల్ రెడ్డి నరసింహ నరేష్ శైలజ బసవయ్య జంగయ్య నరసయ్య బండా స్వామి తదితరులు పాల్గొన్నారు



# మురుగు సమస్యకు పరిష్కారం

- **జీడీనగర్‌లో కాలువల మరమ్మతులు**

**జీడీనగర్, జూలై 14 (మహా)**: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామంలోని బీసీ కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ కాలువ పూర్తిగా మూసుకుపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిల్వ నీటి కారణంగా దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఏర్పడడంతో స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించారు. గ్రామ సర్పంచ్ సూర రమా, ఉప సర్పంచ్ ఉదయ్, బీసీ కాలనీ వార్డు సభ్యులు సట్ల అశోక్ గౌడ్, కంకటి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రైనేజీ కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. హెచ్‌కేఆర్ సిబ్బంది జేసీబీ సహాయంతో కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించి శుభ్రపరిచారు. అలాగే జామ్ అయిన పాత పైపులను తొలగించి, మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా పునరుద్ధరణ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామంలో డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పోచంపల్లి సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- **అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జులై 14 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హెచ్ఎండిఏ ద్వారా భువనగిరి నియోజకవర్గానికి రూ.56 కోట్ల నిధులు తీసుకువచ్చామని, అందులో భాగంగా పోచంపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నేతన్నల నిలయమైన పోచంపల్లిని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పాటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్స్, శ్మశానవాటికల అభివృద్ధి, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పన, అమృత్ పథకం కింద రిజర్వాయర్ నిర్మాణం వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే పోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.7.90 కోట్ల నిధులు కేటాయించామని, చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పోచంపల్లి పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకు ముందు రెండు పారిశుధ్య వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ కార్యక్రమంల మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, వైస్ చైర్మన్ కొయ్యడ రజినిశ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, హెచ్ఎండిఏ పబ్లిక్ హెల్త్, ఎలక్ట్రిసిటీ, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన
# ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




**హైదరాబాద్/యాదాద్రి భువనగిరి జూలై 14 మహా** మాజీ మంత్రి హరీష్‌రావుపై తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. తన కార్యాలయంలో బీర్ల ఐలయ్య విలేకరులతో మాట్లాడుతూ హరీష్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంస్థలను విమర్శిస్తూ మరోవైపు అదే సంస్థలతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, "హరీష్ రావు శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలకు పాలు సరఫరా చేస్తున్నారని, 'మిల్చీ డైరీ' సంస్థకు ఆయనకు సంబంధం ఉందో లేదో ప్రజలకు స్పష్టం చేయాలి" అని డిమాండ్ చేశారు. మిల్చీ పాల సంస్థను హరీష్ రావు సతీమణి నిర్వహిస్తున్నారని, తన్నీరు శ్రీనిత పేరుతో ఆ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. హరీష్ రావుకు 24 గంటల గడువు ఇస్తున్నామని, యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా మిల్చీ సంస్థతో తనకు సంబంధం ఉందో లేదో బహిరంగంగా ప్రకటించాలని సవాల్ విసిరారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంస్థలతో దొంగచాటుగా వ్యాపారం చేస్తూ, ప్రజల ముందు మాత్రం ఆంధ్ర సంస్థలను విమర్శించడం హరీష్ రావుకు అలవాటైందని ఆరోపించారు. తన మిల్చీ సంస్థ ప్రయోజనాల కోసం విజయ డైరీ, మదర్ డైరీ వంటి సంస్థలను నష్టాలపాలు చేశారని కూడా విమర్శించారు. హరీష్ రావు యాదగిరిగుట్టకు వచ్చినా, అసెంబ్లీకి వచ్చినా తనకు అభ్యంతరం లేదని, ఎక్కడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని బీర్ల అయిలయ్య తెలిపారు. "దమ్ముంటే నా సవాల్‌ను హరీష్ రావు స్వీకరించాలి" అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి ద్వారా సంపాదించిన డబ్బుతోనే మిల్చీ డైరీ ఏర్పాటు చేశారని బీర్ల అయిలయ్య ఆరోపించారు. కేటీఆర్, హరీష్‌రావు ఇద్దరూ తెలంగాణ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇద్దరు నేతలకు మతి భ్రమించిందని విమర్శించారు. కేటీఆర్ పాదయాత్ర ప్రకటించగానే హరీష్ రావుకు కూడా పాదయాత్ర గుర్తుకు వచ్చిందని, కేటీఆర్‌ను రాజకీయంగా అడ్డుకునేందుకే హరీష్ రావు పాదయాత్ర చేపడుతున్నారని వ్యాఖ్యానించారు.అదేవిధంగా, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలు బయటపడతాయనే భయంతో బీజేపీతో బీఆర్ఎస్ నేతలు చీకటి ఒప్పందం చేసుకున్నారని బీర్ల అయిలయ్య ఆరోపించారు.




# పాలకుర్తిలో రోడ్డు పనుల ప్రారంభం

- **ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు**

**పాలకుర్తి, జూలై 14 (మహా)**: పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి గ్రామంలో బసంత్‌నగర్ తెలుగు మీడియం పాఠశాల నుంచి గ్రామం వరకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఇదే సందర్భంగా ప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులను ఏఈ, డీఈ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు .ఈ తనిఖీ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలగాని రాజేష్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

# రద్దు కాబడిన రైళ్లను పునరుద్ధరించాలి

- **సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాస్ రెడ్డి**
- **రైల్వే సమస్యలపై డిఆర్ఎంకు వినతి పత్రం**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**

కరోనా సమయంలో రద్దు కాబడిన పలు రైళ్లను వెంటనే పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణకు రైల్వే సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మణుగూరు సూపర్ ఫాస్ట్ కు కిన్నెరసాని పేరు పెట్టాలని కరోనా కాలంలో రద్దు అయిన మణుగూరు కాజీపేట ట్రైను, బెలగావి కొలహాపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ తిరిగి వెంటనే నడిపించాలని అదేవిధంగా మణుగూరు చర్లపల్లి మధ్య ఇంటర్సిటీ ట్రైన్ ప్రజల కోరిక మేరకు నడపాలని దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి నుండి తిరుపతి షిరిడికి ఇటు వేములవాడ బాసరకు ప్రత్యేక రైలు సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆధుని కరుణ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. కొత్తగూడెం నడిబొడ్డున ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రాజీవ్ పార్క్ ప్రగతి మైదాన్ కు వెళ్లే మూసివేసిన దారిని తిరిగి ఓపెన్ చేపించాలని కోరారు. సూపర్ ఫాస్ట్ ను ప్లాట్ నెంబర్ వన్ కు మార్చి నడపాలని స్టేషన్లో ఎంక్వయిరీ కౌంటర్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని అదేవిధంగా రైల్వే స్టేషన్ నుండి గొల్లగూడెం వెళ్లే రహదారి వెడల్పుకు తక్షణమే భూ బదలాయింపు చేసి రోడ్డు వెడల్పు సహకరించాలని డిఆర్ఎమ్ కు శ్రీనివాసరెడ్డి విపులంగా వివరించారు. డిఆర్ఎం మాట్లాడుతూ మణుగూరు కాజీపేట ట్రైన్ త్వరలోనే నడిపిస్తామని కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయటం కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చామని మణుగూరు టు చర్లపల్లి ఇంటర్సిటీ ట్రైన్ ఏర్పాటుకు ఇండియన్ రైల్వేస్ తో చర్చించి నిర్ణయం చేస్తామని స్టేషన్లో ఎంక్వయిరీ కౌంటర్ ను వెంటనే ఏర్పాటు చేపిస్తామని సూపర్ ఫాస్ట్ కూడా కిన్నెరసాని పేరు పెట్టే ప్రక్రియను కూడా పరిశీలిస్తామని తెలిపారు. తిరుపతి శిరిడి వేములవాడ బాసరకు ప్రత్యేక రైలు ఏర్పాట్లు కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కోడుమూరు శ్రీనివాసరావు, ఎడిఆర్ఎం ముత్యాల నాయుడు, సీనియర్ డిఎం కోఆర్డినేటర్ యాదగిరి శశాంక్, డీసీఎం శివహర్ష, డివైసిఎం నరేంద్ర వర్మ, ఏవో రాజేంద్రబాబు, ఏఐ పాషా, సిసిఐ జేమ్స్ పాల్, రైల్వే పోలీస్ సిఐ కృష్ణ, ఎస్సై ప్రశాంత్ రెడ్డి, స్టేషన్ మేనేజర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## యాస్ ట్యాంకర్ ను
## ఢీ కొట్టిన ఇసుక లారీ

**ట్యాంకర్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలోనీ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కొత్తగూడెం వైపు నుండి వస్తున్న యాస్ ట్యాంకర్ ను ఖమ్మం వైపు నుండి వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టడం జరిగింది. ఈ ప్రమాదంలో యాస్ ట్యాంకర్ డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయి క్యాబిన్ లో చిక్కుకొని రక్షించమని బిగ్గరగా అరవడంతో గ్రామస్తులు క్యాబిన్ లో చిక్కుకున్న డ్రైవర్ ను అతి కష్టం మీద బయటకు తీసి, 108 లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇసుక లారీ డ్రైవర్ నిదరమత్తులో లారీని నడపడం వలనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం ప్రధాన రహదారి మధ్యలో జరగడం వలన కొంత సమయం ట్రాఫిక్ కి అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్ అంతరాయాన్ని పునరుద్ధరించారు.


## ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా
# సర్ ప్రక్రియ చేపట్టాలి

**బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్**



యాదాద్రి భువనగిరి జులై 14 మహా భువనగిరి 94 అసెంబ్లీ నియోజకవర్గంలోని 21, 22, 23, 24 వార్డుల పరిధిలో ఉన్న బూత్ నంబర్లు 65, 85, 86, 87, 88, 89, 90లలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మాజీ మున్సిపల్ చైర్మన్,ఆబాది ఎస్ఐఆర్ పరిశీలన ఇంచార్జ్ బర్రె జహంగీర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా నింపించి, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించారు. ఈ సందర్భంగా బర్రె జహంగీర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు నిర్భయంగా తన వివరాలను నమోదు చేసుకునేలా అధికారులు, బీఎల్‌వోలు ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. బీఎల్‌ఓలు సర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఈనెల 14న చివరి తేది అన్ని చెప్పడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈనెల 24 వరకు అవకాశం ఉందని తెలిసిన కూడా బీఎల్‌వోలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని అన్నారు. బీఎల్ఓ లు ప్రజలకు భయభ్రాంతులకు గురి చేయకుండా, సందేహాలను నివృత్తి చేస్తూ స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే, అర్హులైన ప్రతి ఓటరు తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్‌వోలు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి ఓటు విలువైనదని, అందరూ స్వచ్ఛందంగా సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, ఉట్కూరి చక్రధర్ గౌడ్, బర్రె క్రాంతి కుమార్, కసర బోయిన సాయికుమార్ ఉన్నారు.

## గిరిజన సమాఖ్య మహాసభలను జయప్రదం చేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: గిరిజన సమాఖ్య మూడో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం 'శేషగిరి భవన్'లో మంగళవారం పట్టణ సమితి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య(టిజిఎస్) మూడో రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతాయని వివరించారు. మహాసభల తొలిరోజు మధ్యాహ్నం భారీ ఎత్తున మహా ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని 19న ప్రతినిధుల సభ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ నందు జరుగుతుందని తెలిపారు. ఈ పోరాట మహాసభల్లో గిరిజనులు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు గెద్దాడు నగేష్, మాచర్ల శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఎండి యూసుఫ్, నేరెళ్ల శ్రీను, కృష్ణ, వాడే రాములు, మండల రాజేశ్వర్ రావు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు
# శిక్ష పడేలా కృషి చేయాలి

**గంజాయి హాట్‌స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలి**




నెలవారి నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు భద్రాద్రి కొత్తగూడెం, మహా:ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని గంజాయి హాట్ స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా, ప్రాపర్టీ కేసుల డిటెక్షన్ పెంచాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం ఆయన పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నేరాల పరిస్థితి పెండింగ్ కేసులు దర్యాప్తు పురోగతి శాంతిభద్రతలు సైబర్ నేరాలు మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం సహించబోమని హెచ్చరిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈసాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయం వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు గంజాయి హాట్ స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ర్యాపిడ్ డ్రగ్ టెస్ట్ కిట్లతో పరీక్షలు నిర్వహించి నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే అక్రమ మద్యం జూదం పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర దాడులు నిర్వహించాలని సూచించారు. ప్రాపర్టీ కేసులను ప్రాధాన్యతగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు సాంకేతిక ఆధారాలతో త్వరితగతిన ఛేదించి దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించాలని సూచించారు. వాహన తనిఖీలు రాత్రి పెట్రోలింగ్ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ రౌడీ షీటర్లు, హిస్టరీషీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు మహిళలు చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, డయల్ 100కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని ఆదేశించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం ర్యాష్‌డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువులకు పూర్వవైభవం తీసుకురండి

- **హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఎమ్మెల్యే బిఎల్ఆర్ వినతి**



**కుషాయిగూడ, మహా**: నియోజకవర్గంలోని చెరువులను పరిరక్షించి భవిష్యత్ తరాలకు తాగునీరును అందించాలని చెరువులను అభివృద్ధి చేసి ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. నాచారం పటేల్‌కుంట చెరువు, రామంతాపూర్ చిన్న చెరువులో విస్తృతంగా పెరిగిన గుర్రపు డెక్క కారణంగా దోమల వ్యాప్తి పెరిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. వెంటనే చెరువులను శుభ్రపరిచి గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ స్టేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీంతో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణంలో నడకకు అవకాశం కలగడంతో పాటు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రజలకు మేలు చేసే ఈ అభివృద్ధి పనులపై తక్షణ చర్యలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథును కోరారు. చెరువులను భవిష్యత్ తరాలకు పరిరక్షించి నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు నిర్వహించాలని చెరువులలో కలుషిత నీటిని కల్వకుండ చర్యలు తీసుకోవాలి ఆయన కోరారు చెరువులను భూకబ్జాలకు గురికాకుండా వాటిపై ఎప్పటికప్పుడు హైడ్రా పర్యవేక్షణ ఉండాలని చెరువులలో పేరుకుపోయిన పూడికను తొలగించి భవిష్యత్ తరాలకు చెరువులను సుందరీ కరణగా తీర్చిదిద్దాలని చెరువులు కనుమెరుగైపోతే భవిష్యత్ తరాలకు నీరు దొరకక అల్లడిపోతారని అధికారులే కాకుండా ప్రజలు కూడా స్వచ్ఛందంగా చెరువులను పరిరక్షణకు నడుం బిగించాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చెరువులకు పెద్దపీట వేశారని ఆయన గుర్తు చేశారు హైడ్రా కమిషనర్ రంగనాథను కలిసిన వారిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బిఆర్ఎస్ నాయకులు కాసం మైపాల్ రెడ్డి సాయి జెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి వినతి పత్రానికి స్పందించిన రంగనాథ్ చెరువుల పరిశుభ్రత పూడిక తీసివేత చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని రంగనాథ్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి హామీ ఇచ్చారు

# ఎస్ఐఆర్ ప్రక్రియ లో రేషన్ డీలర్లు సహకరించాలి

- **హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**
- **ఎస్ఐఆర్ ను వేగవంతం చేసే ప్రక్రియ పై రేషన్ డీలర్లతో సమావేశం**

హనుమకొండ మహా;ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి చేయడంలో జిల్లాలోని రేషన్ డీలర్లు సహకరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల రేషన్ డీలర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియ ను వేగవంతం చేయడంపై జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ఓటర్లకు గణన ఫారాలను(ఎన్యూమరేషన్ ఫారాల )అందించారని, ఓటర్లు పూరించిన ఫారాలను తిరిగి బీఎల్వోలకు అందించడంలో రేషన్ డీలర్లు సహకరించాలని అన్నారు. తమ పరిధిలో ఉన్న ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనే విధంగా రేషన్ డీలర్లు సహకరించాలన్నారు.రెండు చోట్ల ఓట్లు కలిగి ఉండడం కూడా చట్ట ప్రకారం తీసుకునే చర్యలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియని జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయడంలో అందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు రమేష్ బాబు, మోహన్, ఆయా మండలాల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వ కుట్ర : ఏబీవీపీ

- **జిల్లాలోని యూనివర్సిటీలు కళాశాలల బంద్ విజయవంతం**
- **జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్**

**ఇబ్రహీంపట్నం జూలై 14 మహా:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వీరపట్టం జిల్లాలోని అన్ని యూనివర్సిటీలు, డిగ్రీ జూనియర్ కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్ మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలపై ఆధారపడి ఉన్నారని, అయితే ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో రూ.11,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, 4.5 లక్షల మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించిన వారు, ఎన్నికల సమయంలో బకాయిలన్నీ చెల్లిస్తామని, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల ఫీజులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి, విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు బకాయిలను విడుదల చేయలేదని, ఈ అంశం న్యాయస్థానం దృష్టికి కూడా వెళ్లిందని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలలు-ప్రభుత్వం మధ్య జరుగుతున్న నిర్లక్ష్య ధోరణిలో విద్యార్థులే బలవుతున్నారని, బడ్జెట్ లేక అనేక కళాశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని, ఉపాధి కోసం లెక్చరర్లుగా పనిచేస్తున్న నిరుద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు తప్ప ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని స్పష్టం చేశారు. రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రశ్నించిన విద్యార్థులపై లాఠీచార్జీలు, అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను ఉద్యమ వేదికలుగా మార్చి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ రుద్రపల్లి మహేందర్, ఢిల్లీ భాను, స్టేట్ టెక్నికల్ సెల్ కో కన్వీనర్ వి చింతల గుణవంత్ రెడ్డి, స్టేట్ ఎస్ఎఫ్ఐ కో కన్వీనర్ పుప్పాల ఆదర్శ్ పటేల్, జిల్లా టెక్నికల్ శివా, కార్తీక్, నాని, భరత్ వంశీ, వంశీ, నవదీప్, విగ్నేష్, చరణ్, ప్రేమ్ రాజ్, ప్రమోద్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.




# డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్

**ఇబ్రహీంపట్నం జూలై 14 మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలిగి, బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని అనుభవజ్ఞులైన అధ్యాపకులు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని, ఎప్పటికప్పుడు వారి సమాచారం తెలుసుకోవాలని కోరారు. అదేవిధంగా విద్యార్థుల పరిశోధన అభ్యాసం కొరకు జిజ్ఞాస కార్యక్రమం, పరీక్షల నిర్వహణ విధానం, క్రెడిట్ లు, సిలబస్, ప్రాక్టికల్స్ మొదలైన విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. కళాశాలలో ఉన్న ఎన్ఎస్ఎస్ మూడు విభాగాలు మరియు టి ఎస్ కే సి, స్కిల్ డెవలప్మెంట్ విభాగం మొదలైన వాటిలో విద్యార్థులు చేరి తమ కెరీర్ ను మెరుగుపరుచుకోవాలని అధ్యాపకులు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డి ఎస్ ఎస్ ఆర్ కృష్ణ వ్యవహరించగా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సురేష్ అకాడమిక్ కోఆర్డినేటర్ జె. నరేందర్ రెడ్డి, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ ఎన్. సురేష్,డా. డివి రావు, డా. రమేష్, డా. రాకేష్ భవాని,డా. రచన,డా. సురేఖ మరియు ఇతర అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

- **విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **జిల్లా కలెక్టర్ అంకిత్**
- **చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భూసేకరణ ఎస్ఐఆర్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అదేవిధంగా విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం చంద్రుగొండ మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిప్పనపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులు మద్దుకూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ అనంతరం చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూసేకరణ ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య పోషకాహారం క్రీడలకు అవసరమైన ప్రోత్సాహం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముందుగా తిప్పనపల్లి గ్రామంలో కొనసాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులను పరిశీలించారు. సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తిప్పనపల్లి గ్రామ పరిధిలో మొత్తం 70 ఎకరాల భూమికి సర్వే నిర్వహించాల్సి ఉండగా ప్రతిరోజూ సుమారు 15 ఎకరాల మేర సర్వే చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి భూ యజమానికి సంబంధించిన వివరాలతో పాటు బోర్లు సాగులో ఉన్న పంటలు ఆయిల్ పామ్ తోటలు ఇతర శాశ్వత ఆస్తుల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ పరిశీలన డిజిటలైజేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 65 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారులు వివరించగా మిగిలిన ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా డిజిటలైజేషన్ చేపట్టాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా ఖచ్చితత్వంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న సాంబార్ పలుచగా ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని పరిశుభ్రత నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు విద్యా ప్రగతి యూనిఫాంల పంపిణీపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం క్రమశిక్షణ జట్టు స్ఫూర్తి నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో అశోక్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అక్రమ అరెస్టులను ప్రభుత్వం మానుకోవాలి: ఎస్ఎఫ్ఐ

- **చలో సెక్రటేరియటకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు**
- **ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి ఏర్పుల తరంగ్**

**ఇబ్రహీంపట్నం జూలై 14 మహా**: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాలను అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి ఏర్పుల తరంగ్ అన్నారు. మంగళవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా తనను తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎస్ఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను వీడి విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ మరింత బలంగా ఉద్యమిస్తుందని, ఎలాంటి బెదిరింపులు, అక్రమ అరెస్టులకు భయపడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయకులు రంజిత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# బోధనలో సాంకేతిక పరిజ్ఞానం

**ఆదిలాబాద్ మహా:** పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినూత్న సాంకేతిక సాధనాలను ఉపయోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తిరుపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం, బొక్కల్ గూడ లోని ప్రభుత్వ గెజిటెడ్ 2వ ఉన్నత పాఠశాల లో ఆంగ్ల భాష సబ్జెక్టు లపై ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా కోపైలట్ సాఫ్ట్‌వేర్ పై నిర్వహించిన 3 రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉపాధ్యాయులు సులభంగా పాఠ్యాంశాల ప్రణాళికను తయారు చేసుకోవచ్చని, అందుకు సంబంధించిన వీడియోలను, అదనపు సమాచారాన్ని పొంది విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారిని డిజిటల్ బోధన ద్వారా తరగతి గదుల్లో భాగస్వాములను చేయాలన్నారు. ఫిజికల్ సైన్స్, ఆంగ్లం ఉపాధ్యాయులు నిత్య జీవితంలో జరిగే అంశాలను, క్రీడలను శాస్త్ర సాంకేతికతతో ముడిపెట్టి బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు పొందిన శిక్షణ వివరాలను, పాఠశాల భద్రతా ప్రణాళికలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే, గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని 10% పెంచాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఈఓలు నిరంతరం సమీక్షలు జరపాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# క్షయ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె. ఆనంద్ మంగళవారం కూకట్‌పల్లిలోని శివానంద రిహాబిలిటేషన్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 50 మంది క్షయ (టీబీ) రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ పోషకాహార కిట్లను ప్రసాద్ హాస్పిటల్ యాజమాన్యం తరఫున డాక్టర్ సుమా ప్రసాద్ నిక్షయ్ మిత్రగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. ఆనంద్ మాట్లాడుతూ, క్షయ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం అందిస్తున్న మందులను క్రమం తప్పకుండా వినియోగిస్తూనే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పూర్తి చికిత్స తీసుకుంటే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** కాప్రా డివిజన్ శంకు కాలనీకి చెందిన సుబ్రమణ్యం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి డాక్టర్ ఏఎస్‌రావు నగర్‌లోని పాలోమీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సుబ్రమణ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై యుగంధర్ గౌడ్**

**వలిగొండ జులై 14 మహా న్యూస్** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సిఐ వెంకటేశ్వర్లు ఎస్సై యుగంధర్ గౌడ్ అన్నారు మంగళవారం మత్తు పదార్థాల పై యువత మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని మత్తు పదార్థాల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అన్నారు



# కష్టాల్లో కార్యకర్తలకు అండగా ఉంటా

- **హన్మకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు కుడా చైర్మన్ ఇనగాల**
- **బాధితులను, బాధిత కుటుంబాలను పరామర్శించిన ఇనగాల**

**హన్మకొండ మహా ;** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఆయన పరామర్శించారు. పర్యటనలో భాగంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల పట్టణానికి చెందిన బొచ్చు రమేష్ కుమారుడు, ప్రముఖ బాడీ బిల్డర్ ప్రసంగి ఏడు నెలల క్రితం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సుదీర్ఘ కాలం వివిధ ఆసుపత్రులలో చికిత్స పొంది, మంగళవారం ఆయన డిశ్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు.అలాగే హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జాఫర్ రిజ్వీ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని వారి నివాసానికి వెళ్లి రిజ్వీ ఆరోగ్య పరిస్థితిని అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా పరకాల పట్టణానికి చెందిన ప్రముఖ నాయకులు చందుపట్ల చిన్న మల్లా రెడ్డి రెండు రోజుల క్రితం మరణించగా మంగళవారం వారి నివాసానికి వెళ్లి చిన్న మల్లా రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. ఆత్మకూరు మండలం, హౌస్ బూజుర్గు గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజేందర్ ఇటీవల అకాల మరణం చెందారు. రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హౌస్ బూజుర్గు గ్రామానికే చెందిన షేక్ సలేహ ఆక్సిడెంట్ లో తీవ్ర గాయాలయ్యి ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ లో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకుని నేరుగా హాస్పిటల్ కు వెళ్లి సలేహ ని పరామర్శించారు వైద్యులతో మాట్లాడి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

# "సర్" ను వేగం చేయండి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**కుషాయిగూడ, మహా :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.నియోజకవర్గంలో ఎస్ఐఆర్ కార్యక్రమం ఆశించిన స్థాయిలో పురోగతి సాధించడం లేదని పేర్కొన్న ఆయన.. ప్రతి నాయకుడు, బూత్ స్థాయి ఇన్‌చార్జి, కార్యకర్త బాధ్యతగా ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను గుర్తించి పేరు నమోదు చేయించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఒక్క ఓటు కూడా వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకునేలా ప్రజలకు సహకరించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.




## మాజీ సర్పంచ్ భౌతిక కాయాన్ని సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** అనారోగ్యంతో మృతిచెందిన భోరజ్ మండలం మాండగడ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్ర నాందేవ్ యాదవ్ భౌతిక కాయాన్ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సందర్శించారు. మంగళవారం మాండగడ గ్రామంలోని ఆయన నివాసం వద్ద భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. పార్టీ కోసం గ్రామంలో ఎంతో కష్టపడి పని చేసారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు కొండా గంగాధర్, బండారి సతీష్, నిమ్మల గౌతమ్ రెడ్డి, ప్రభాకర్, షౌకత్, షకీల్, దేరా కృష్ణా రెడ్డి, సంతోష్ తదితరులున్నారు.





# వంద శాతం ఎన్యుమరేషన్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి

- బీఎల్వోలతో కలిసి ప్రక్రియను పర్యవేక్షించాలి
- వారం రోజులు కష్టపడండి
- కాంగ్రెస్ అనుకూల ఓటు ఒక్కటి కూడా పోకుండా జాగ్రత్త వహించాలి
- ఫాం నింపకపోతే ఓటు పోయే ప్రమాదం
- అవగాహన సదస్సులో కంది శ్రీనివాస రెడ్డి, నరేష్ జాదవ్ సూచనలు





**ఆదిలాబాద్ మహా :** ఒక వారం రోజులు అన్ని పనులు వదిలి కేవలం ఎస్ఐఆర్ పై దృష్టి పెట్టాలని అదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ అన్నారు. మంగళవారం బీఎల్ ఏ2లు, సూపర్ వైజర్లు, మండల అధ్యక్షులు పార్టీ నాయకుల, కార్యకర్తలతో ఎస్ఐఆర్ ప్రక్రియ పై కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేసారు. ప్రతి బూత్ స్థాయిలో ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. బీఎల్వో లతో అనుసంధానమై ఎన్యుమరేషన్ ప్రక్రియను పర్యవేక్షించి ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలని సూచించారు.ఇందులో భాగంగా జైనథ్ మండలం 66 శాతంతో ఈ ప్రక్రియలో చాలా ముందుందని అభినందించారు.అనంతరం సాత్నాల మండల నాయకులు కూడా 60 శాతం ప్రక్రియను చేపట్టినట్టు తెలిపారు. బేల 57శాతం , భోరజ్ మండలం 54శాతం, పూర్తి చేసిందన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం 53శాతం మావల 31 శాతం ఆదిలాబాద్ అర్బన్ లో 26 శాతం పూర్తి అయ్యిందన్నారు. ఈ వారం రోజులు కష్టపడి వందశాతం పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారాలు నింపకపోతే ఓటు పోయే ప్రమాదం ఉందని కంది శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలు మండల అధ్యక్షులు మన అనుకూల ఓటు ఒక్కటి కూడా పోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. బతికున్న ప్రతి ఓటరు యొక్క ఎన్యూమరేషన్ ఫామ్ నింపేలా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్యంత బాధ్యతతో చేపట్టాలని, ప్రతి ఇంటికి చేరుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజార్ పాషా, లీగల్ సెల్ చైర్మన్ మంగేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు సుధాకర్ గౌడ్, కొండా గంగాధర్, బూర్ల శంకరయ్య, గుడిపెల్లి నగేష్, దౌలత్, వెంకన్న యాదవ్, రషీద్, అర్బజ్, షహీద్ తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఇందిరమ్మ ఇండ్లతో తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సొతింటి కల నెరవేర్చుతుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు జరీనా బేగం షేక్ అనిఫ్ ,, సంగర్తి ప్రియాంక రాజశేఖర్, ,రజిత పోశెట్టి దంపతులకు చెందిన నివాసాలను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు.రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు.లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు కొండా గంగాధర్, బండారి సతీష్,నిమ్మల గౌతమ్ రెడ్డి, ప్రభాకర్, షౌకత్, షకీల్, దేరా కృష్ణా రెడ్డి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్యుమరేషన్ ప్రక్రియ ను పరిశీలించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాలు నింపి బీఎల్వోలకు అందించి డిజిటలైజేషన్ పూర్తి చేసేలా బీఎల్ఏ2లు, సూపర్ వైజర్లు, పార్టీ మండలాధ్యక్షులు కృషి చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచించారు.మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని పలు వార్డులలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. 33 వవార్డు లోని శాంతినగర్, పుత్లిబౌలీ కాలనీలో పర్యటించిన ఆయన బీఎల్ఏ2లకు పలు సూచనలు చేసారు. ఫారాలు నింపుతన్న తీరును పరిశీలించారు. బీఎల్వోలతో అనుసంధానంగా పనిచేస్తూ నింపిన వెంటనే డిజిటలైజేషన్ చేయించాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు కొండా గంగాధర్, బండారి సతీష్, నిమ్మల గౌతమ్ రెడ్డి, ప్రభాకర్, షౌకత్, షకీల్, దేరా కృష్ణా రెడ్డి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## వాస్తు ప్రకారం ఎమ్మార్వో కార్యాలయంలో మరమ్మత్తులు...

**ఉత్తరంలో ఉన్న ఎమ్మార్వో సెట్టింగ్ ని , తూర్పుకు మార్పు..**

**రాజేంద్రనగర్ మహా ;** వాస్తు సరిగ్గా లేకపోవడంతోనే ఎమ్మార్వో కార్యాలయం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఉత్తరంలో ఉన్న ఎమ్మార్వో సెట్టింగ్ వల్లనే గత ఎమ్మార్వో అవినీతి ఆరోపణలతో శంషాబాద్ నుంచి బదిలీ అయ్యారనే పుకారు షికారుకావడంతో. లక్షల రూపాయల వేచించి నూతన ఎమ్మార్వో ఉత్తరం వైపు ఉన్న, తన సిట్టింగును తూర్పు వైపుకు మార్చుకుంటున్నారు. కార్యాలయానికి వచ్చే పోయేవారు చెవులు కొరుక్కుంటున్నారు.ప్రవేశం,కూర్చునే ద్వారం అవరోధాలను తొలగించడానికి మార్పులు చేర్పు లు అవసరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.ఎమ్మార్వో కార్యాలయంలో ఉన్న సామాను సైతం వరండాలో ఉంచారు.

# విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ మహా :** విద్య, క్రీడలు రెండింటిలోనూ రాణించేలా విద్యార్థులు ఎదగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) లో యువజన సేవలు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, క్రీడా శిక్షణ, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నాలుగో, ఐదో తరగతి విద్యార్థులతో ఆంగ్ల, తెలుగు పాఠ్యాంశాల పై ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని కలెక్టర్ పరిశీలించారు. జాతీయ జెండా విశిష్టత, అశోక ధర్మచక్రం ప్రాధాన్యత పై విద్యార్థులు తెలిపిన సమాధానాలను అభినందించారు.విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు వారి సహజ ప్రతిభను గుర్తించి, ఆయా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు, కోచ్‌లకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి దానికి అనుగుణంగా శిక్షణ అందించడం ఎంతో అవసరమన్నారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం నాణ్యత, వసతి, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చి ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డిని ఆదేశించారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, భోజనశాల, వంటశాల, వసతి గృహాలు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులకు కలెక్టర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి, బాగా చదువుకోవడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని జిమ్ హాల్, ఇండోర్ స్టేడియం, ఇతర క్రీడా మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి పై యువజన సేవలు అలాగే క్రీడల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలి**

తదనంతరం జిల్లా యువజన సేవలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ను కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును సమీక్షించారు. స్విమ్మింగ్ పూల్, వాటర్ పైప్‌లైన్ వ్యవస్థ, జిమ్ సెంటర్, ఇతర మరమ్మత్తు తో పాటు అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్‌లో జరుగుతున్న మరమ్మత్తు, అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు, క్రీడాకారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్విమ్మింగ్ పూల్ సేవలను వినియోగించుకునేలా అవసరమైన అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

స్విమ్మింగ్ పూల్ నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని సూచించారు. నిర్వహణలో లోపాలు తలెత్తకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాలని, తరచూ మరమ్మత్తులు అవసరం లేకుండా శాశ్వత పరిష్కారాలతో నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వహణ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకొని, అవసరమైతే సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ప్రశాంత్, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, యువజన సేవలు, క్రీడల శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ గంటూ బాయి ని పరామర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** అనారోగ్యంతో బాధపడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్ దరి గ్రామ సర్పంచ్ గంటూ బాయిని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మరామర్శించారు. మంగళవారం ఆసుపత్రిలో ఆమెను కలిసి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు కొండా గంగాధర్, బండారి సతీష్,నిమ్మల గౌతమ్ రెడ్డి, ప్రభాకర్, షౌకత్, షకీల్, దేరా కృష్ణా రెడ్డి,సంతోష్ తదితరులున్నారు

## వర్షపు నీటిని ఒడిసిపట్టాలి..

**నీటి సంరక్షణపై అవగాహన..**
**మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్**

**మొయినాబాద్ మహా:** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు ప్రతి నీటి బొట్టును సంరక్షించాలని మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దుబ్బ సోనియా అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం ప్రభుత్వ జిల్లా పాఠశాలలో వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరతను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు, స్థానిక కౌన్సిలర్లు, గీత వనజాక్షి, చేగూరి అరుణ రామకృష్ణ గౌడ్, పాటీ పావని జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ విభాగం అధికారులు, ఈఈ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో భారీగా గంజాయి పట్టివేత

**తనిఖీల్లో 20.898 కిలోల గంజాయి పట్టివేత**

మహబూబాబాద్ మహా ; మహబూబాబాద్ జిల్లా గూడూరులో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచార ప్రకారం ఒడిశా నుండి గుజరాత్ తరలిస్తుండగా, పోలీసులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. గూడూరు పోలీసు స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించగా, వారి వద్ద ఉన్న బ్యాగుల్లో సుమారు 20.898 కిలోల గంజాయి బయటపడిందని సమాచారం. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ. 10,44,900/ వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.అరెస్టు చేసిన నిందితులను గుజరాత్ రాష్ట్రం, సూరత్ నగరానికి చెందిన గురు లోకనాథ్ పాత్రా (39) తో పాటు ఇజ్రాయిన్ ఖాసిం సంద్వాని (32)గా పోలీసులు గుర్తించారు.నిందితులు ఒడిశాలోని బెరహంపూర్ ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, దాన్ని గుజరాత్ లోని సూరత్‌కు అక్రమంగా తరలించి ఎక్కువ ధరకు విక్రయించేందుకు ప్లాన్ చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుల నుండి గంజాయితో పాటు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారిపై ఎన్డిపిఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశారు.

# ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి

**ఆటలతోనే అభ్యాసానికి బాట**
**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**

మహా వరంగల్ బ్యూరో;ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సామర్థ్యాభివృద్ధి శిక్షణలను మంగళవారం జీహెచ్ఎస్ కరీంబాద్, జీహెచ్ఎస్ శంభునిపేట కేంద్రాల్లో నిర్వహిస్తున్నశిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, కార్యాచరణ ఆధారిత బోధన, తరగతి గది నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.శిక్షణలు కేవలం హాజరుకే పరిమితం కాకుండా తరగతి గదిలో స్పష్టమైన మార్పు తీసుకురావాలని సూచించారు.విద్యార్థుల అభ్యాస స్థాయికి అనుగుణంగా బోధన సాగించాలని, ఖాన్ అకాడమీ, ఎల్ఐపీ, ఎఫ్ఎల్ఎన్, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ లెర్నింగ్, లైబ్రరీ కార్నర్స్ వంటి విద్యా కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విశ్లేషణ, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందేలా బోధన ఉండాలని సూచించారు.

**కరీంబాద్ ప్రీ-ప్రైమరీ విభాగం సందర్శన**

చిన్నారులకు ఆటలు, పాటలు, కథల ద్వారా బోధన అందిస్తే నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగి సమగ్ర వికాసం




సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. జీపీఎస్ కరీంబాద్ లోని ప్రీ ప్రైమరీ పాఠశాలను సందర్శించి బోధన, అభ్యాస కార్యక్రమాలను పరిశీలించారు.ప్రీప్రైమరీ తరగతుల్లో ప్లే వే మెథడ్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, బోధన, అభ్యాస సామగ్రి (టీఎల్ఎం) వినియోగం, చిన్నారుల భాగస్వామ్యాన్ని పరిశీలించిన కలెక్టర్ చిన్నారులతో మమేకమై వారితో మాట్లాడారు.అనంతరం పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ రైమ్స్ చెప్పిస్తూ ఉత్సాహపరిచారు.ప్రతి ప్రీప్రైమరీ పాఠశాలలో ప్లే వే మెథడ్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, టీఎల్ఎం వినియోగంతో ఆనందదాయకమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీఈఓ రంగయ్యానాయుడు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్,ఏఎంఓ ఉండ్రాతి సుజన్ తేజ, ప్రధానోపాధ్యాయులు జయప్రకాశ్, ఉల్లాస్, కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, డీఆర్‌పీలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్

**కలెక్టర్ చైతన్యంతో కదిలిన ఓటర్లు**

**వరంగల్ మహా :** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డా. సత్యశారద మంగళవారం వరంగల్ నగరంలోని చింతల్, లెనిన్‌నగర్, రంగసాయిపేట ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడిన కలెక్టర్, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) పూర్తి సహకారం అందించాలని కోరారు. చింతల్ లో మైనారిటీ ఓటర్లు ఎక్కువగా ఉన్నందున వారి ఓటు భద్రంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు వారి వారి ఓటరు వివరాలను సకాలంలో అందజేసి, ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు అందించాలని సూచించారు.ఓటరు జాబితా స్వచ్ఛంగా, పారదర్శకంగా రూపొందేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ పరిశీలనలో కిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, అధికారులు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.





మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | బుధవారం, హైదరాబాద్ | 15-06-2026



ANN తెలుగు

# రకుల్ సిఫారసుతో ప్రగ్యాకు ఛాన్స్?

టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొన్నేళ్లుగా వరుస హిందీ చిత్రాల్లో నటిస్తూ బాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత బలపరుచుకున్న రకుల్, అక్కడి నిర్మాతలు, దర్శకులతో మంచి వృత్తిపరమైన అనుబంధాన్ని ఏర్పరుచుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమెకు బాలీవుడ్‌లో మంచి ప్రభావం ఉందనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. బాలీవుడ్‌లో కొత్త ప్రాజెక్టుల ఎంపిక, నటీనటుల కాస్టింగ్ సమయంలో ఇప్పటికే గుర్తింపు పొందిన నటీనటుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం సాధారణమే. ఈ నేపథ్యంలో రకుల్ ప్రీత్‌కు కూడా అక్కడ విశ్వసనీయత, బలమైన ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ఏర్పడినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె సూచనలతోనే నటీనటులకు అవకాశాలు లభిస్తున్నాయనే విషయంపై ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు.ఇదిలా ఉంటే, టాలీవుడ్‌లో



మంచి గుర్తింపు తెచ్చుకున్న పలువురు కథానాయికలు మళ్లీ బాలీవుడ్‌పై దృష్టి సారిస్తున్న ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. తెలుగు చిత్రాల్లో విజయాలు సాధించిన తర్వాత జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు అందుకోవాలనే లక్ష్యంతో హిందీ చిత్రాల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ జాబితాలో ప్రగ్యా జైస్వాల్ పేరు కూడా వినిపిస్తోంది. తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉన్నప్పటికీ, కెరీర్‌ను మరింత విస్తరించాలంటే బాలీవుడ్‌లోనూ అవకాశాలు అవసరమనే అభిప్రాయం పలువురు హీరోయిన్లలో కనిపిస్తోంది.ప్రస్తుతం సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, రకుల్ ప్రీత్ సింగ్ నటిస్తున్న ఓ హిందీ చిత్రంలో ఆమె సన్నిహిత స్నేహితురాలు ప్రగ్యా జైస్వాల్‌కు అవకాశం వచ్చేలా రకుల్ కీలక పాత్ర పోషించిందనే ప్రచారం జరుగుతోంది. ఈ వార్త సోషల్ మీడియాలో కూడా చర్చకు దారితీసింది. అయితే దీనిపై రకుల్, ప్రగ్యా లేదా సంబంధిత చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.మొత్తంగా టాలీవుడ్ హీరోయిన్లు బాలీవుడ్‌లో అవకాశాలు అందుకోవడానికి ప్రయత్నించడం, అక్కడ బలమైన వృత్తిపరమైన పరిచయాలు ఏర్పరుచుకోవడం, రకుల్ ప్రీత్ ప్రభావంపై జరుగుతున్న ప్రచారం ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చగా మారింది. అయితే ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## నటనతో ఆకట్టుకుంటున్న నూర్

వినోద రంగంలో తన అందం, ఆత్మవిశ్వాసం, సహజమైన నటనతో వేగంగా గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి నూర్. టెలివిజన్, ఓటీటీ వేదికలపై తన ప్రతిభను చాటుకుంటూ ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదిస్తోంది. ఇటీవల ఆమె చేసిన ముఖ్యమైన నటనా అరంగేట్రం పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. తొలి ప్రధాన అవకాశాన్నే సమర్థంగా వినియోగించుకుని తన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది.

ప్రముఖ నిర్మాతలు సర్గున్ మెహతా, రవి దూబే నిర్మించిన 'బదల్ పే పావ్ హై' డ్రామా సిరీస్‌లో నూర్ కీలకమైన సమాంతర కథానాయిక పాత్రలో కనిపించింది. కథలో భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రను ఎంతో సహజంగా, హృద్యంగా పోషించి ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. సంక్లిష్టమైన భావాలను తెరపై సులభంగా ఆవిష్కరించే ఆమె నటనకు మంచి స్పందన లభించింది. ఈ పాత్ర ద్వారా నూర్‌లోని నటిగా ఉన్న ప్రతిభ మరింత స్పష్టంగా వెలుగులోకి వచ్చింది.అయితే షూటింగ్ జరుగుతున్న సమయంలో ఆమె భుజానికి అనుకోకుండా గాయం కావడంతో కొంతకాలం చిత్రీకరణకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయినప్పటికీ చికిత్స అనంతరం త్వ ర గా నే కోలుకుని మ ళ్లీ సెట్స్‌కు చేరుకోవడం ఆమె వృత్తిపట్ల ఉన్న అంకితభావాన్ని చాటింది. గాయం తర్వాత కూడా అదే ఉత్సాహంతో షూటింగ్‌లో పాల్గొనడం సహనటులు, చిత్రబృందం, అభిమానుల ప్రశంసలు అందుకునేలా చేసింది. ఆమె క్రమశిక్షణ, పని పట్ల ఉన్న నిబద్ధత పరిశ్రమలో మంచి పేరు తెచ్చిపెట్టాయి.టెలివిజన్‌తో మాత్రమే పరిమితం కాకుండా ఇప్పుడు వెండితెరపై కూడా తన ముద్ర వేయాలని నూర్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆమె పలు సినిమాలు, ప్రముఖ ఓటీటీ సంస్థల కోసం రూపొందుతున్న భారీ ప్రాజెక్టుల్లో నటిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే వాటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. వరుస అవకాశాలతో కెరీర్‌ను మరింత విస్తరించుకుంటూ యువ నటిగా తన స్థాయిని పెంచుకుంటోంది.నటనతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ నూర్ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఆమె పాల్గొనే ఫొటోషూట్లు, స్టైలిష్ లుక్స్, ఆధునిక దుస్తుల ఎంపిక సోషల్ మీడియాలో విపరీతమైన ఆదరణ పొందుతున్నాయి. ప్రతి కొత్త ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటూ ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా పేరు సంపాదిస్తోంది. అందం, అభినయం, ఆత్మవిశ్వాసం కలగలిసిన నూర్ రాబోయే రోజుల్లో భారతీయ వినోద రంగంలో మరింత బలమైన స్థానాన్ని సంపాదించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## మనసును అర్థం చేసుకునే వ్యక్తే కావాలి:

# ప్రీతి ముకుందన్

తెలుగులో 'కన్నప్ప' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైన నటి ప్రీతి ముకుందన్, ఇటీవల విడుదలైన తమిళ డబ్బింగ్ చిత్రం 'బ్లాస్ట్ జోన్'తో మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. 'కన్నప్ప' సినిమాతోనే ఆమెకు మంచి గుర్తింపు వచ్చినప్పటికీ, 'బ్లాస్ట్ జోన్' తర్వాత యువతలో ఆమెకు అభిమానుల సంఖ్య మరింత పెరిగింది. తన అందం, అభినయంతో ఆకట్టుకుంటున్న ఈ భామ ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉండటమే కాకుండా సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటోంది. తాజాగా ఆమె తన జీవిత భాగస్వామిలో ఉండాల్సిన లక్షణాల గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఒక ప్రమోషనల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రీతి మాట్లాడుతూ, ఏ రిలేషన్‌షిప్‌లో అయినా తనకు అత్యంత ముఖ్యమైన లక్షణం 'ఎంపతీ' అని చెప్పింది. ఎదుటి వ్యక్తి భావాలను అర్థం చేసుకుని, వారి పరిస్థితిని గౌరవించే మనస్తత్వం ఉన్న వారిని తాను ఎక్కువగా ఇష్టపడతానని వెల్లడించింది. తన భావోద్వేగాలు, ఆలోచనలను అర్థం చేసుకుని, ప్రతి పరిస్థితిలో అండగా నిలిచే వ్యక్తే తన జీవిత భాగస్వామిగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపింది.

ఇద్దరి మధ్య పరస్పర అవగాహన, గౌరవం ఉంటేనే బంధం బలంగా కొనసాగుతుందని తాను నమ్ముతానని ప్రీతి పేర్కొంది. ఒకరినొకరు అర్థం చేసుకునే స్వభావమే మంచి సంబంధానికి పునాది అని ఆమె అభిప్రాయపడింది. ఆమె చెప్పిన ఈ మాటలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ఇక ప్రీతి కథానాయికగా నటించిన తాజా తమిళ చిత్రం 'ఇదయం మురళి' తెలుగులో 'హృదయం మురళి' పేరుతో విడుదలైంది. సినిమా కథకు మంచి స్పందన వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగు చిత్రాలపై కూడా ప్రీతి ప్రత్యేక దృష్టిసారించింది. మంచి కథలు, విభిన్న పాత్రలకు ప్రాధాన్యం ఇస్తూ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు ఆమె సిద్ధమవుతోంది.



## రానా వర్సెస్ రిషబ్ శెట్టి?

టాలీవుడ్ స్టార్ రానా దగ్గుబాటి తదుపరి సినిమా గురించి సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. దర్శకుడు ప్రశాంత్ వర్మ రూపొందిస్తున్న ప్రతిష్ఠాత్మక 'జై హనుమాన్' చిత్రంలో రానా కీలక పాత్రలో నటించనున్నారనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ పాన్ ఇండియా చిత్రంలో రిషబ్ శెట్టితో రానా హైవోల్టేజ్ పోరులో కనిపించనున్నారనే వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

'బాహుబలి'లో భల్లాలదేవ పాత్రతో తన విలక్షణ నటనను చాటుకున్న రానా, మరోసారి ప్రతినాయక ఛాయలు ఉన్న పాత్రలో కనిపిస్తే ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తారనే అభిప్రాయం సినీ విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతోంది. భారీ పాత్రలను తనదైన శైలిలో ఆవిష్కరించే రానా ఈ చిత్రంలో భాగమైతే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'జై హనుమాన్' చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. 2027లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం పనులు కొనసాగిస్తున్నట్లు సమాచారం. సూపర్ హిట్‌గా నిలిచిన 'హనుమాన్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ చిత్రంలో రిషబ్ శెట్టి కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అలాగే 'హనుమాన్' హీరో తేజ సజ్జ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం కానున్నారని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇప్పుడు రానా పేరు కూడా ఈ చిత్రంతో వినిపిస్తుండటంతో అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది. అయితే రానా పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు, ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే విషయాలు అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




# అల్లు అరవింద్ కొత్త రిస్క్

రిస్క్ తీసుకోవడమే కాదు.. కొత్త ట్రెండ్‌లకు శ్రీకారం చుట్టడంలో గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ ఎప్పుడూ ముందుంటారనే పేరు ఇండస్ట్రీలో ఉంది. టాలీవుడ్‌లో భారీ విజయాలు సాధించిన అనేక సినిమాల వెనుక ధైర్యమైన నిర్ణయాలు, విభిన్న ఆలోచనలు, కొత్త కథలే ప్రధాన కారణమయ్యాయి. అందరూ సురక్షితమైన మార్గాన్ని ఎంచుకుంటున్న సమయంలో ఎవరూ ఊహించని కాన్సెప్ట్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో అల్లు అరవింద్ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆయన మరో సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

అల్లు అరవింద్ సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే మార్కెట్‌లో వచ్చే మార్పులను ముందుగానే అంచనా వేసి నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు మంచి అనుభవం ఉందని తెలుస్తుంది. కొత్త దర్శకులకు అవకాశాలు కల్పించడం, వినూత్న కథలను ప్రోత్సహించడం, చిన్న సినిమాలకు పెద్ద వేదిక కల్పించడం, ప్రేక్షకుల అభిరుచిని ముందుగానే గుర్తించి ప్రాజెక్టులను రూపొందించడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకుంటారు. అందుకే గీతా ఆర్ట్స్ నుంచి వచ్చే ప్రతి కొత్త సినిమా పరిశ్రమలో ప్రత్యేక చర్చకు దారి తీస్తుంటుంది.

ప్రస్తుతం భారతీయ సినీ మార్కెట్‌లో పురాణాలు, ఇతిహాసాలు, భారతీయ సంస్కృతి ఆధారంగా రూపొందుతున్న చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. ఇదే సమయంలో యానిమేషన్ రంగం కూడా



వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు చిన్నారులకు మాత్రమే పరిమితమని భావించిన యానిమేషన్ సినిమాలు ఇప్పుడు అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే స్థాయికి చేరుకుంటున్నాయి. అయితే ఇలాంటి చిత్రాల నిర్మాణంలో భారీ పెట్టుబడితో పాటు అధిక సమయం, అత్యున్నత సాంకేతిక నైపుణ్యం అవసరం. కథలో బలం లేకపోయినా లేదా విజువల్స్ ఆశించిన స్థాయిలో లేకపోయినా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. అందుకే చాలామంది నిర్మాతలు ఇలాంటి ప్రయోగాలకు దూరంగా ఉంటారు. కానీ కొత్త దారులు అన్వేషించడంలో అల్లు అరవింద్ ఎప్పుడూ వెనుకడుగు వేయరనే అభిప్రాయం పరిశ్రమలో ఉంది.

ప్రస్తుత ట్రెండ్‌ను అనుసరించడం కంటే రాబోయే ట్రెండ్‌ను ముందుగానే గుర్తించి అడుగులు వేయడం అల్లు అరవింద్ విజయ రహస్యంగా సినీ వర్గాలు చెబుతున్నాయి. అదే ఆలోచనతో మరో వినూత్న ప్రయోగానికి ఆయన సిద్ధమవుతున్నారనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక ప్రకటన ఇంకా వెలువడనప్పటికీ, సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం గీతా ఆర్ట్స్ కాళీమాత కథాంశంతో భారీ యానిమేషన్ చిత్రాన్ని రూపొందించే దిశగా సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కథా రచన కూడా పూర్తయిందని టాక్ వినిపిస్తోంది.

గతంలో కాళీమాత కథల ఆధారంగా వచ్చిన చిత్రాలు పెద్ద స్థాయిలో వాణిజ్య విజయాలు సాధించకపోయినా, ఈసారి అత్యాధునిక యానిమేషన్ టెక్నాలజీ, ప్రపంచస్థాయి విజువల్ ఎఫెక్ట్స్, బలమైన భావోద్వేగాలతో ఆ కథను కొత్త కోణంలో ఆవిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారం నిజమై ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ప్రేక్షకుల ఆదరణ పొందితే, అది కేవలం మరో సినిమా విజయం మాత్రమే కాకుండా తెలుగు చిత్రసీమలో యానిమేషన్‌కు కొత్త దారులు చూపిన చిత్రంగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com